నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 21-11-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 99 పేజీలు: 8 వెల: రూ.1/-

అసోంలో ఘోర ప్రమాదం
8 మంది మృతి

అసోం, నవంబర్ 20: అసోంలోని ఉదల్‌గురి జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. జాతీయ రహదారి 15పై ఓరాంగ్ గెలబిల్ ఏరియా వద్ద కారు – ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న 8 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారంతా ఓ పెళ్లి వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాద ఘటనపై అసోం సీఎం సర్బానంద సోనోవాల్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫెస్టివల్ ఇండియా జాయ్–2019 ఎక్స్‌పోను ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్.

యానిమేషన్, గేమింగ్‌కు..
చిరునామాగా తెలంగాణ

- ప్రపంచస్థాయి స్టూడియోలు హైదరాబాద్‌లో ఉన్నాయి
- చిత్రపరిశ్రమకు హైదరాబాద్ చక్కని వేదిక
- ఐటీశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్20(ఆర్ఎన్ఎ): యానిమేషన్, గేమింగ్‌కు చిరునామాగా తెలంగాణ మారిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో అతిపెద్ద ఈవెంట్‌కు హైదరాబాద్ వేదికైంది. హెచ్ఐసీసీలో 'ఇండియా జాయ్' కార్యక్రమాన్ని బుధవారం కేటీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నటి నమ్రత, అల్లు అరవింద్, వంశీ పైడిపల్లి తదితరులు హాజరయ్యారు. నాలుగు రోజులపాటు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. ప్రపంచస్థాయి స్టూడియోలు హైదరాబాద్ నగరంలో ఉన్నాయన్నారు. చిత్ర పరిశ్రమకు హైదరాబాద్ చక్కనివేదికగా మారిందని తెలిపారు. వీఎఫ్ఎక్స్, గేమింగ్, యానిమేషన్ రంగంలో కోట్లాది రూపాయాల వ్యాపారం జరుగుతోందని, యానిమేషన్ వచ్చిన తర్వాత మూవీ మేకింగ్ మరోస్థాయికి చేరిందని కేటీఆర్ తెలిపారు. సినిమా మేకింగ్‌లో వీఎఫ్ఎక్స్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 'బాహుబలి', 'ఈగ', 'మగధీర' వంటి సినిమాలు సినిమా రంగాన్ని ఎంతో ప్రభావితం చేశాయని కేటీఆర్ తెలిపారు. 2.3 బిలియన్ ఆక్టివ్ గేమర్లు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారని, ఏడాదికి 25శాతం గేమింగ్ ఇండస్టీ వృద్ధి నమోదు చేస్తోందని అన్నారు. గేమింగ్ విభాగం నుంచి రూ.250 కోట్ల ఆదాయం ఉండగా.. ఇది 2020కి మూడు రెట్లు పెరుగుతుందని అనుకుంటున్నామని అన్నారు. ఓటీటీ బ్రాడ్‌కస్టర్ లోకల్ భాషల్లో కంటెంట్ అందిస్తోందని, చోట భీమ్ అందుకు మంచి ఉదాహరణ అని కేటీఆర్ తెలిపారు. నగరంలో రూ.1000 కోట్ల పెట్టుబడిలో ఇమేజ్ టవర్స్ ఏర్పాటు చేస్తున్నామని, 2021 లేదా 2022 లో ఇమేజ్ టవర్స్ ప్రారంభమవుతాయని మంత్రి అన్నారు.. ఏవీజీసీని విద్యార్థులకు సబ్జెక్ట్‌గా అందించాలని అనుకుంటున్నామని, గేమింగ్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీకి సబ్సిడీలు ప్రకటించబోతున్నామని అన్నారు. ఇండియా జాయ్ ద్వారా గేమింగ్ అండ్ మీడియా సెక్టార్‌ని ప్రమోట్ చేయనున్నామని, యానిమేషన్, గేమింగ్ ఇండస్ట్రీకి చక్కని డెస్టినేషన్ తెలంగాణ అవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు.

ఆర్టీసీ సమ్మెపై.. త్వరలో కేంద్రాన్ని కలుస్తాం

- ■ ప్రభుత్వం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- ■ ప్రజా సమస్యలపై గవర్నర్‌కు ఉన్న శ్రద్ధ కేసీఆర్‌కు లేదు
- ■ కనీసం కలిసేందుకు సీఎం సమయం కూడా ఇవ్వడం లేదు
- – గవర్నర్ తమిళసైని కలిసిన అఖిలపక్షం నేతలు

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మెపై త్వరలోనే కేంద్ర పెద్దలను కలుస్తామని, అవసరమైతే రాష్ట్రపతిని కలిసి కేసీఆర్ ప్రభుత్వం తీరుపై వివరిస్తామని అఖిలపక్షం నేతలు పేర్కొన్నారు. బుధవారం ఆర్టీసీ సమ్మె వ్యవహారంలో అఖిలపక్షం నేతలు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళసైని కలిశారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పు, ప్రభుత్వ అఫిడవిట్, సునీల్ శర్మ అఫిడవిట్, ఐఏఎస్ అధికారుల కోడ్ ఆఫ్ కండక్ట్ కాపీలను గవర్నర్‌కి సమర్పించారు. అనంతరం బీజేపీ నాయకుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ సమ్మెపై జోక్యం చేసుకోవాలని కోరామని తెలిపారు. నియంతలా వ్యవహరిస్తున్న కేసీఆర్ వైఖరిపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకురాలు గీతారెడ్డి మాట్లాడుతూ.. విలీనంపై కార్మికులు వెనక్కితగ్గినా పట్టించుకోవట్లేదని ఆరోపించారు. తటస్థంగా ఉండాల్సిన ఆర్టీసీ ఎండీ ఇచ్చిన అఫిడవిట్‌పై గవర్నర్‌కి ఫిర్యాదు చేశామని వివరించారు. సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌కు కనికరం లేదని విమర్శించారు. గవర్నర్ అయినా అపాయింట్‌మెంట్ ఇచ్చారు కానీ, కేసీఆర్ మాత్రం ఇవ్వరని ఎద్దేవా చేశారు. ప్రయాణీకుల అవస్థలు దృష్టిలో పెట్టుకొని మానవతా దృక్పథంతో ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని గవర్నర్‌ని కోరామని పేర్కొన్నారు. మరోవైపు అఖిలపక్షం ఆధ్వర్యంలో త్వరలో ఢిల్లీ వెళ్లి కేంద్ర రవాణా శాఖ మంత్రిని కలవాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. అనంతరం టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అందుబాటులో లేకపోవడంతో గవర్నర్‌తో మొరపెట్టుకున్నామని తెలిపారు. సమ్మెను చట్ట వ్యతిరేకంగా చూడకుండా కార్మికులు ఎప్పుడు సమ్మె విరమించినా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ చేసిన రాజకీయ వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్టు కోదండరాం తెలిపారు. తమ విజ్ఞప్తులపై గవర్నర్ సానుకూలంగా స్పందించారన్నారు. ముఖ్యమంత్రి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు కాబట్టే.. సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. కార్మికులు సమ్మె విడిచి వస్తే..విధుల్లోకి తీసుకోవాలని కోర్టు చెప్పిందని, సమ్మె చట్టం వ్యతిరేకం కాదని న్యాయస్థానం వ్యాఖ్యానించిందన్నారు. రాజకీయ వ్యాఖ్యలు చేసిన సునీల్ శర్మపై.. చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. తమ విజ్ఞప్తులపై గవర్నర్ సానుకూలంగా స్పందించారన్నారు.

పాలవ్యాపారి దారుణ హత్య

మేడ్చల్ ,నవంబరు20(ఆర్ఎన్ఎ): మేడిపల్లి పీఎస్ పరిధిలోని చెంగిచెర్ల వద్ద ఓ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. చెంగిచెర్లకి చెందిన పాల వ్యాపారి దోడెల పరమేష్(52) అర్ధరాత్రి దారుణహత్యకు గురయ్యాడు. పరమేష్ తలపై బలమైన గాయాలు అయ్యాయి. హత్య జరిగిన దగ్గరలోని బార్‌లో పరమేష్ మద్యం సేవించి గుర్తు తెలియని వ్యక్తులతో గొడవపడటం వల్ల హత్య జరిగినట్లు సమాచారం. సుమారు రాత్రి 11.30 ప్రాంతంలో హత్య జరిగినట్లు తెలుస్తోంది. హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్‌లో రూ.2 కోట్లతో అత్యాధునిక గ్రంథాలయం

మేడ్చల్, నవంబర్ 20: మేడ్చల్ పట్టణంలో రూ. 2 కోట్లతో అత్యాధునిక సాంకేతికతతో గ్రంథాలయాన్ని నిర్మిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ప్రకటించారు. మేడ్చల్ గ్రంథాలయ సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంత్రి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మల్లారెడ్డి గ్రంథాలయ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్, ఎంపీపీ పద్మజ, జడ్పీటీసీ శైలజ, గ్రంథాలయ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన యువకులు

ఘట్‌కేసర్ మండలం ఇస్మాయిల్‌ఖాన్‌గూడ గ్రామానికి చెందిన యువకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. యువకులందరికీ మంత్రి పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు యువకులు తెలిపారు.

చరిత్రలో నేటినిజం

కం॥ కాఉంచెన శోధనలకు
లాభ్యగు నోబెల్ బహుమతి గ్రహించె, ధరన్
భావికి బాటలు వేసిన
"సివి రామను" వెలుంగు తేముషిఅభినుదన్!!

(నవంబర్ 21 సీ.వీ. రామన్ పుణ్యతిథి) –రాధశ్రీ

సెల్: 9494481210

హైదరాబాద్‌లో జీఏడి ప్రత్యేక కార్యదర్శి అర్వర్ సిన్హాతో భేటీ అయిన సింగపూర్ కాన్సూల్ జనరల్ తదితరులు.

మహారాష్ట్రలో కొనసాగుతున్న ప్రతిష్టంభన

పవార్ ప్రకటనతో మరింత అస్పష్టత మళ్లీ చక్రం తిప్పేందుకు సిద్ధంగా బిజెపినేతలు

న్యూఢిల్లీ,నవంబర్20(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో వరుస భేటీలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. శివసేనకు అధికారం దక్కినట్లే దక్కి దూరం అవుతోంది. కాంగ్రెస్–ఎన్సీపిల మద్దతుతో అధికారంలోకి వస్తుందనుకుంటున్న తరుణంలో ఎన్సీపి అధినేత శరద్ పవార్ చేసిన వ్యాఖ్యలు గందరగోళంలోకి నెట్టాయి. పట్టుదలకు పోవడం వల్లనే అధికారం పంచుకోలేక పోతున్నట్లుగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా అభిప్రాయపడ్డారు. మొత్తంగా శివసేన,బిజెపి కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందని కేంద్రమంత్రి అథవాలే చేసిన వ్యాఖ్యలు కూడా మళ్లీ కొత్త పొత్తులు పొడుస్తాయా అన్న భావన కలిగిస్తున్నారు. అటు శివసేన ముఖ్య నేత సంజయ్ రౌత్ మాత్రం రోజుకో ప్రకటన చేస్తున్నారు. అటు ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీని కలిశారు. తాజాగా ప్రధానిని కలిశారు. కేవలం మహారాష్ట్రలో రైతులకు సాయం కోసంమాత్రమే కలిశామని అంటున్నారు. మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు అంశంపై ప్రతిష్టంభన నేపథ్యంలో ఈ భేటీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాష్ట్రంలో మెజారిటీ ఎవరికి ఉంటే వారు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయవచ్చునని రౌత్ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. బీజేపీకి అవకాశం ఇవ్వకుండా శివసేన ముందుకువస్తే.. ఆ పార్టీతో కలిసి ఎన్సీపీ, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయవచ్చునన్న ఊహాగానాల నేపథ్యంలో శరద్ పవార్ సోనియాతో భేటీ అయ్యారు.

సోనియా నివాసంలో వీరి భేటి జరిగింది. శివసేనతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమేనంటూ ఎన్సీపీ ఇప్పటికే సంకేతాలు పంపిన సంగతి తెలిసిందే. శివసేన హ్యాండ్ ఇచ్చిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై బీజేపీ అధినాయకత్వం ఎలాంటి అడుగు వేయలేదు. సీఎం పదవి పంచే ప్రసక్తే లేదని, అయితే ఇప్పటికే సంకీర్ణ ప్రభుత్వం విషయంలో శివసేనకు డోర్లు తెరిచే ఉన్నాయని బీజేపీ నేతలు అంటున్నారు. ఇక, మహారాష్ట్రలో ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాని సంగతి తెలిసిందే. శివసేనతో కలిసి పోటీ చేసిన బీజేపీ వందకుపైగా స్థానాలు సాధించి సింగిల్ లా÷–జ్గ÷స్ట్ పార్టీగా అవతరించి నప్పటికీ.. ఆ పార్టీ మెజారిటీ మార్కుకు చాలా దూరం నిలిచిపోయింది. మరోవైపు 56 స్థానాలు గెలిచిన రియల్ కింగ్‌మేకర్‌గా అవతరించిన శివసేన సీఎం పీఠాన్ని నగకాలం తమకు పంచాల్సిందేనని పట్టుబడుతోంది. సీఎం పదవిని పంచేందుకు బీజేపీ ఏమాత్రం సిద్ధపడటం లేదు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ ప్రతిష్టంభన కొనసాగుతోంది. కాంగ్రెస్, ఎన్సీపీలతో కలిసి శివసేన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయవచ్చునని చెప్తున్నా.. అదీ ఎంతవరకు సాధ్యమనేది తేలడం లేదు.

మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

హైదరాబాద్, నవంబర్ 20 (ఆర్ఎన్ఎ) : రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో హరిణి (24) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడింది. హరిణి స్వస్థలం మహబూబ్‌నగర్‌లోని జగదాంబ కాలనీ. మాదాపూర్‌లోని గోల్డెన్ హిల్స్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో హరిణి రెండున్నర సంవత్సరాల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. హరిణి గచ్చిబౌలిలోని వెంకటేశ్వర ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగానికి వెళ్లేది. ఆమె పనిచేస్తున్న కంపెనీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. హరిణికి వచ్చే నెల డిసెంబర్‌తో కాంట్రాక్ట్ ముగుస్తుంది. దాంతో తన ఉద్యోగం పోతే మరో ఉద్యోగం రాదేమోనన్న భయంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మంగళవారం రాత్రి దాదాపు 8:45 గంటలకు ఆమె ఉంటున్న హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ యాజమాన్యం ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కశ్మీర్‌లో ఇంటర్నెట్ ఆంక్షలు త్వరలో ఎత్తివేస్తాం

- – అక్కడ పరిస్థితి సాధారణంగానే ఉంది
- – రాజ్యసభలో కేంద్ర మంత్రి అమిత్ షా



హైదరాబాద్, నవంబర్20(ఆర్ఎన్ఎ) : కశ్మీర్‌లో ఇంటర్నెట్ ఆంక్షలు త్వరలో ఎత్తివేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. బుధవారం రాజ్యసభలో ఆయన మాట్లాడారు.. జమ్మూ కశ్మీర్‌లో ఇంటర్నెట్ సర్వీసుల గురించి స్థానిక ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. కశ్మీర్ ప్రాంతంలో పాక్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, సెక్యూర్టీని దృష్టిలో పెట్టుకుని స్థానిక ప్రభుత్వమే ఇంటర్నెట్ సర్వీసుల అంశంలో నిర్ణయం తీసుకుంటుందన్నారు. కశ్మీర్ ప్రజల కోసం కావాల్సినన్ని మెడిసిన్స్ అందుబాటులో ఉన్నట్లు ఆయన చెప్పారు. మొబైల్ మెడిసిన్ వ్యాన్స్ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. హెల్త్ సర్వీసుల గురించి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఎల్‌పీజీ, బియ్యం కావాల్సినంత ఉన్నట్లు తెలిపారు. కశ్మీర్‌లో 22 లక్షల మెట్రిక్ టన్నుల యాపిల్స్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ల్యాండ్‌లైన్స్ అన్నీ ఓపెన్‌గానే ఉన్నట్లు చెప్పారు. తాను చెప్పిన అంశాలపై కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ స్పందించాలని షా సవాల్ విసిరారు. ప్రస్తుతం కశ్మీర్‌లో పరిస్థితి సాధారణంగానే ఉందని షా అన్నారు.

అడవుల పెంపకానికి ప్రాధాన్యం

- పెద్ద ఎత్తున హరితహారంతో మొక్కల పెంపకం
- ఫారెస్ట్ ప్లస్ 2.0 కార్యాక్రమంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్‌లో ఫారెస్ట్ ప్లస్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు

హైదరాబాద్,నవంబరు20(ఆర్ఎన్ఎ): అడవుల పెంపకం, పరిరోణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. తెలంగాణలో పెద్ద ఎత్తున అటవీ పెంపు కార్యక్రమం జరుగుతోందన్నారు. అలాగే హరితహారంతో మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు. ఫారెస్ట్ ప్లస్ 2.0 కార్యక్రమాన్ని రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నేడు ప్రారంభించారు. అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ సహకారంతో జలం – శ్రేయస్సు కోసం అడవులు అనే ధ్యేయంతో ఫారెస్ట్ ప్లస్ 2.0. కార్యక్రమాన్ని మెదక్ అటవీ డివిజన్ పరిధిలో అమలు చేయనున్నారు. యూఎస్ ఎయిడ్ – కేంద్ర అటవీ పర్యావరణ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో ఫారెస్ట్ ప్లస్ 2.0 అమలు కానుంది. అటవీ పునరుజ్జీవనం, అడవుల్లో నీటి వనరుల అభివృద్ధికి సహకరించనుంది. నగరంలోని సోమాజిగూడలో గల ది పార్క్ హోటల్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూఎస్ ఎయిడ్ ప్రతినిధుల వర్గిస్ పాల్, రమొనో, కేంద్ర అటవీ శాఖ ఐజి నోయాల్ థామస్, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటిర్ అర్. శోభ, అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ అండ్ ఎండీ రఘువీర్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సరోగసీ మహిళలకు లైఫ్‌టైం బీమా ఇవ్వండి: ఎంపీ బండా ప్రకాశ్

హైదరాబాద్, నవంబర్ 20: టీఆర్ఎస్ ఎంపీ బండా ప్రకాశ్ ఇవాళ రాజ్యసభలో మాట్లాడారు. సరోగసీ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన కొన్ని సూచనలు చేశారు. బిల్లులో అన్ని విషయాలు స్పష్టంగా లేవని ఎంపీ ప్రకాశ్ తెలిపారు. బిల్లులో మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు లేవన్నారు. అబార్షన్ గురించి బిల్లులో ఎటువంటి స్పష్టత లేదన్నారు. ప్రెగ్నెంట్ మహిళలకు కేవలం 16 నెలలు మాత్రం ఇన్సూరెన్స్ కల్పించడం సరిగా లేదన్నారు. సరోగసీ మహిళలకు లైఫ్ టైం బీమా ఇవ్వాలన్నారు. 16 నెలల తర్వాత సరోగసీ మహిళల రక్షణ ఎవరు చూసుకుంటారని ఆయన ప్రశ్నించారు. గర్భధారణ చేసే మహిళకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వరాదన్న క్లాజ్‌ను ఎంపీ ప్రకాశ్ తప్పుపట్టారు. సరోగసీ తల్లికి ఎవరు జీతం చెల్లిస్తారని ఆయన అడిగారు. అటువంటి మహిళల జీవనభృతిపై స్పష్టత లేదన్నారు. సరోగసీ మహిళలకు మెటర్నిటీ లీవులు ఇస్తారా అని టీఆర్ఎస్ ఎంపీ ప్రశ్నించారు.

రెండంతస్తుల భవనం నుంచి దూకిన వ్యక్తి

హైదరాబాద్, నవంబర్ 20: మారేడుపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి.. రెండు అంతస్తుల భవనం పైనుంచి కిందకు దూకాడు. బాధిత వ్యక్తి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆహ్వానం

తేజ ఆర్ట్ క్రియేషన్స్ & శ్రీ త్యాగరాయ గానసభ

సంయుక్త ఆధ్వర్యంలో

ప్రముఖకవి

ఆచార్య కడారు వీరారెడ్డి గారి

దీర్ఘ కవిత

"భార్యాభర్తల బంధం - ఇగిరిపోని గంధం"

ఆవిష్కరణ



ముఖ్య అతిథి & ఆవిష్కర్త : డా॥ కె.వి. రమణాచారి గారు ఐఏఎస్(రి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు

సభాధ్యక్షులు : ఆచార్య మసన చెన్నప్ప గారు పూర్వ అధ్యక్షులు, తెలుగుశాఖ ఉ.వి.

విశిష్ట అతిథి : శ్రీ వి.ఎస్. జనార్ధనమూర్తి గారు అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

గౌరవ అతిథులు : శ్రీ దాస్యం సేనాధిపతి గారు ప్రముఖ కవి, విమర్శకులు

: శ్రీ బైస దేవదాసు గారు సంపాదకులు, 'నేటి నిజం' దినపత్రిక

వేదిక: శ్రీమతి కళా లలిత కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్.

తేది: 27-11-2019 (బుధవారం) సమయం: సా॥ 6.00 గం॥లకు

ఆహ్వానించువారు

శ్రీమతి కళా శారద, ప్రధాన కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ

డా॥ పోరెడ్డి రంగయ్య, అధ్యక్షుడు, తేజ ఆర్ట్ క్రియేషన్స్

బాల వికాసం

-చిందం సునీత
తెలుగు లెక్చరర్

జగిత్యాల జిల్లా రాయికల్ మండల్ ఇటిక్యాల ఆదర్శ పాఠశాల 'పిన్సిపాల్' యం. శ్రీనివాస్ పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయటంలో ఆటపాటలు, చెట్ల పెంపకం, చిత్ర లేఖనం, పరిసరాల పరిశుభ్రతతో పాటు సాహిత్యానికి కూడా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఉపాధ్యాయ బృందం వెంకటేశ్, రాజ్‌కుమార్, శ్రీధర్, సల్లాడద్దీన్, నవీన్, స్రవంతి, గంటజల కస్తూరి, కోమలి, నరేశ్, ఇక్బాల్, రమేశ్, కిషోర్, అనిల్ చిందం సునీతలు పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల ఆ విద్యార్థులు రాసిన కవిత్వం ఈ వారం నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

పల్లె

సక్కనైన, అందమైన మాపల్లె
చూసేందుకు సాలవు రెండు కళ్ళు
పొద్దున్నే లేవమని పిలుపునిచ్చే కోడి కూతలు
కిచుకిచుమని పక్షుల అరుపులు
అవి విన్న పిల్లల్లో ఆకాశమంత ఆనందం నిండే
రైతన్న కష్టంతో పని చేస్తే ఆ శ్రమని
మరిచేలా కోయిల పాటలు
తేడాలు లేకుండా కలిసి ఉండే మనుషులు
ఎన్నో రకాల సాంస్కృతిక పండుగలు
ఆ పండుగలకు కాంతినిచ్చే పడితుల అందాలు
మిలమిల మెరుపులతో వర్షాలు
కలకల కాంతులతో గుడిలో దీపాలు
ఎంతో మంచి జీవితాన్నిచ్చే చదువు సంధ్యలు
ఊరికే సోకునిచ్చే చెరువు, వాగు, వంకలు
మర్యాదలకు మారుపేరు-గౌరవానికి అసలు పేరు
దానంలో కర్ణులు- ధైర్యంలో భీములు
సత్యాన్ని పలికేటి- గమ్యానికి ముందడుగేసి
పల్లెల్లో కీర్తి తెచ్చిన పల్లె మనుషులు.

- డి.మమత
10వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

మారాలి మానవులు

మానవులారా! మానవులారా! వినండి వినండి
ప్రకృతిని కాపాడుదాం!
అభివృద్ధిని చెందుదాం!
ప్రకృతి మూలం చెట్లు
ఆ చెట్లని నాశనం చేయకండిరా!
ఓ మానవ!
'ప్రకృతి మాటలను' మనకు తెలిపేది పక్షులేరా!
తీయని మాటలను తెలిపే పక్షులను
టవర్లు పెట్టి చంపకండిరా!
ప్రకృతికి అందం అందమైన గుట్టలు
జంతువుల నివాస స్థావరాలు!
వాటిని మైనింగ్ చేసి
ప్రకృతి అందాన్ని పడగొట్టకండిరా!
ప్రకృతి ఉంటేనే జీవకోటి బతుకుతుందిరా!
ఓ మానవా!
ప్రకృతిని నాశనం చేస్తే
జీవకోటికి నివాసం ఎక్కడిదిరా!
ఇకనైనా మారాలి!
మనిషి మనిషికి చెట్లను పెంచే
బాధ్యతను గుర్తెరిగి నడవాలి!!

- సి.హెచ్. హరీష్‌బాబు
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

మనిషి-చెట్టు జీవన బంధం

చెట్లను చెట్టమ్మను నేనురా
నాతో మీకు ముడిపడి ఉందిరా!
అందరి అవసరాలను తీరుస్తున్నానురా!
వర్షాలు కురిపిస్తానురా!
పంటల్ని పండిస్తానురా! గడ్డి మొలిపిస్తానురా!
జంతువులకు ఆహారం దొరుకుతుందిరా!
ప్రత్యక్షంగా, పరోక్షంగా కాపాడే కన్నతల్లినిరా!
మానవ మనుగడకు ఆధారం నేనురా!
జీవకోటిని పోషిస్తానురా!
భూమిని కాపాడాలంటే చెట్లు వలన అవుతుందిరా!
చెట్లను నరకడం ఆపండిరా!
చెట్లను నాటకం పెంచండిరా!
చెట్లను ప్రేమగా చూడండిరా!
చెట్టు చెట్టమ్మను నేనురా
నాతో మీకు ముడి పడి వుందిరా
తెలుసుకోరా!
ఓ మానవుడా!
నీ ప్రాణానికి నేనే భిక్షననీ..

- ఎన్. రాహుల్ యాదవ్
9వ తరగతి,ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్,జిల్లా: జగిత్యాల

ప్రేమంటే

అక్షరానికి అంతుపట్టనిది
వెతికినా దొరకనిది
దొరికినా గుర్తించలేనిది
గుర్తించినా వర్ణించలేనిది
వర్ణించినా అంతులేనిది
అందరితో ఉండేది
కొందరికే దక్కేది.

- కె.నాగవీనీల
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్ జిల్లా: జగిత్యాల

పువ్వంటే నాకిష్టం

అబ్బబ్బా పువ్వు
అందాల పువ్వు
ఎంతో మంచి పువ్వు
అబ్బబ్బా పువ్వు
ఎంతో మంచి రంగు
అబ్బబ్బా పువ్వు
ఎంతో చక్కటి పువ్వు
దేవునికి పెట్టే పువ్వు
అబ్బబ్బా పువ్వు
అందరు మెచ్చే పువ్వు
అబ్బబ్బా పువ్వు
తలలో పెట్టె పువ్వు
అబ్బబ్బా పువ్వు
తోటలో పువ్వు అందాల పువ్వు
అబ్బబ్బా పువ్వు
ఇష్టం ఇష్టం నాకిష్టం
పువ్వంటేనే నాకిష్టం.

- చెంగళ శ్రీనిధి
6వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

అందాల మా బడి

అందాల బడి అందమైన మాబడి
ఆ బడే మాకు అమ్మ ఒడి!
అందులో మేం ఆడుతాం కబడ్డీ!
మరియు కోతిగంతులు!
మా బడే మాకు సరస్వతీ ఆలయం!
పాఠశాలలో ఉంటారు పిల్లలు
స్టాఫ్ రూంలోని టీచర్లు
మాకు మార్గదర్శకాల పాఠాలెన్నో
చెపుతారు!
మా బడి పక్కకు ఉంటాయి మక్కసేన్లు!
అక్కడికి వస్తాయి కోతులు
మేం చేస్తాం వాటితో సమానంగా అల్లరి!
ఆటపాటల్లో చిచ్చర పిడుగులం
చదువులో మాదే ప్రభంజనం
మాకిస్తారు ఎన్నో బహుమతులు
ప్రకృతిలో పచ్చదనం
మాబడిలో చెట్లెంతో అందం!
అందాల మాబడి అందమైన మాబడి.

-సి. మధుకర్
9వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

అందం

చెట్లందం పెంచుదాం
దేశమంతా చెట్లతో
పచ్చగుంచుదాం!
మనకిచ్చును చల్లగాలి
వర్షాలు ప్రాణమై కురుస్తాయి!
పంటలెన్నో పండు
రైతు ఎంతో సంతోషించు
పక్షులెంతో ఆనందించు
పర్యావరణాన్ని రక్షించు!
అందుకే మనమూ పెంచాలి!
బాధ్యతగా మసలాలి
దేశమంటే మనదేనోయి
దేనికి నీవు వెనకాడకోయి!

- భీమరాజు
8వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

అమ్మ-అమృతం

మన పుట్టుకకు తొలి పలుకు అమ్మ
మన జన్మకు మొదటి పుడమి అమ్మ
మన బ్రతుకు బాటలో తుది తోడు అమ్మ
ఆనందానికి చిరుస్వప్నం అమ్మ
గెలుపుకు తొలిమెట్టు
అపురూప స్నేహ లాలిత్యం
తుదిశ్వాస దాక నిలిచి తరిస్తుంది
కళ్ళముందు కదలాడే దైవం అమ్మ
ఎల్లపుడు తోడుండి
కష్టాలు రాకుండా కనురెప్పలా కాపాడి
శక్తినిచ్చే అమ్మ
మనసులో కల్మషంలేక
ఔన్నత్యాన్ని పెంచేది అమ్మ!
అందుకే
అమ్మను దైవంలా ఆరాధించాలి.

- ఎం. వైష్ణవి
10వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

స్వేచ్ఛాబడి

బడమ్మ బడి ఎంతో మంచి బడి
మా మంచి బడి
బడి చుట్టు చెట్లు
ప్రగతికి ఎన్నో మెట్లు
సరస్వతీ ఇల్లు!
చదువుని ఇచ్చే ఇల్లు!
చేస్తుంది ఎంతో మేలు!
గుడిలాగా ఉంటుంది!
గురువులాగా ఉంటుంది!
పుస్తకాలు ఇస్తారు
పలు విషయాలు చెబుతారు!
పాఠం నేర్చుకొని-జ్ఞానం పెంచుకొని
భావి భారత పౌరులమేమౌతాం!
స్నేహితులుగా ఉంటాము
సహాయమెంతో చేస్తాము!
మంచి మాటలు నేర్చుకొని
మానవత్వం చాటుతాం!
మా మంచి బడిలోన
మాకెంతో స్వేచ్ఛ!

- జి. హేమంత్
8వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

ఇష్టమైన చెట్టు

చెట్లంటే నాకిష్టం
ప్రకృతి అంటే పరవశిస్తా!
పండ్లు ఫలాలనిస్తుంది!
ఎండలో ఉన్నా నీడను
ఎప్పుడు ఇస్తుంది!
ఆకలిగా ఉన్నా
పండ్లను ఎన్నో ఇస్తుంది!
మన రోగాలన్నింటికి
ఔషదాలెన్నో ఇస్తుంది!
కూరగాయలెన్నో ఆకు కూరలెన్నో!
అందంగా ఇస్తుంది!
తనువంతా తరతరాలకు ఇస్తుంది
అందుకనే నాకిష్టం చెట్లంటే!
చెట్లని పెంచుదాం రండి రండి!!

- జి. లక్ష్మి ప్రసన్న
7వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

సృష్టికి మూలం-అమ్మ

సృష్టిని పుట్టించింది దేవుడైతే
ఆ దేవుడు పుట్టించింది అమ్మను!
దేవుడు ప్రతిచోట ఉండలేక
అమ్మను సృష్టించాడు!
అనంత లోకాలనేలే ఆ దేవుడు
అమ్మను ఈ లోకంలోకి పంపాడు!
మానవ జన్మకు సార్థక దారిని చూపాడు!
అమ్మంటే ఓ దైవం!
ఎన్నెన్నో పనులు, బాధలు, కష్టాలు
అన్నీ భరించే మౌన దేవతా
అందుకే అమ్మ ఆది గురువు!
దేవుడు అందరికీ జీవంపోస్తే
అమ్మ మన జీవితానికి జీవంపోసి
అద్భుతమైన జీవితాన్నిచ్చి ఆనందిస్తుంది!
అమ్మతో అనుబంధం జీవితంలో
మరువనిది బంధం!

- ఎల్. అంజలి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

సమాజం తీరు

విజ్ఞానం విశ్వం విస్తరిస్తు వుంది
మారనిది అన్యాయం అమాయకత్వం
కాలం కన్ను తెరుస్తు ఉంది
కాని ఆగవు ఈ కన్నీటి రక్తధారలు
మనిషికి మనిషికి మధ్య మనస్పర్థలు
మనసుల్లో ఉంటాయి మాయమత్తులు
మీదికి సూడా మాత్రం మమకారాలు
కులమత కర్కసులతో కలహాలు
బడుగోళ్ళ పాలిట రాబందులు
సామాన్య సహాయకులకు అవమానాలు
బలిసినోళ్ళకు మాత్రం సన్మానాలు
ఇంకెప్పుడు ఈ దేశం ముందుకు సాగేది
ఇంకెన్నడు ఈ లోకం స్వతంత్రత పొందేది
'నాకెందుకు' అనే నిర్లక్ష్యంలో నిమగ్నమై
అన్యాయ అక్రమాలను ప్రోత్సహిస్తు
నీ మేధస్సును నీవే ధ్వంసం చేస్తున్నావు
కదులు ముందుకు
ముందుకు కదిలి నీలోని జ్ఞానాన్ని
ఈ లోకానికి తెలియజెయ్యి
నీ కదలికతో మొదలవుతుంది దేశ ప్రగతి
నిస్సహీనతతో ముడివేసుకొన్న సంకెళ్ళని
ధైర్యంగా తెంచివేసి ప్రగతిపథం పట్టు
దేశ ప్రగతి నీ ముందుంటుంది.

- ఎ. గీత
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

మాయ సెల్‌ఫోన్

సెల్‌ఫోన్ ఒక మాయల మరాఠి
అది చేస్తుంది మనుషులను హస్తవ్యస్తం!
అపుడు అవుతారు అందరు నాశనం!
అది ఉన్న ఇంట్లో ఉంటుంది శోకం!
అయినా!
ఎవరు ఆపరు దాని వాడకం!
ఇష్టం కొద్ది కొంటారు దాన్ని
ఎన్నో కష్టాలు తెచ్చిపెట్టుకుంటారు ఇంట్లోకి!
దాని వాడకంలో మానవుల విజ్ఞత!
ఆపాలి దాని చెడు ప్రభావం!
మంచిని గ్రహించాలి
చెడును వదలాలి!
అప్పుడే ప్రగతి పురోభివృద్ధి!

- ఎం. వైష్ణవి
10వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

రక్షణ

ఆడవారు లేని సృష్టిలేదు
ఆడవారు లేని ఈ సృష్టి
ఊహించుకోవడం
చాలా కష్టం!
మగవాళ్లు అనుకుంటారు!
ఆడవాళ్ళు ఆట బొమ్మలనీ! కానీ!
ఆడవారు అంటే
ఆది పరాశక్తనీ తెలుసుకోవాలి!
రోద్దెంటపోతే రక్షణే లేదు!
పెళ్ళైతే అత్తమామలతో
అత్తింటి కష్టాలు!
కడలిలా విసిరికొడతాయి!
భయం బయం ఎప్పుడు
జీవితం భయం భయం
రక్షణ లేని రోజులొచ్చాయి!
నా మనసు విలవిలలాడుతూ
నేనే కవినైతే!
నా కలంతో రక్షణ కల్పిస్తా!

- ఎం. మహేష్
7వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

జగిత్యాల జిల్లా, రాయికల్ మండలంలోని ఇటిక్యాల మాడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పుడమి

పుడమి తల్లీ నీవమ్మా
ధరణిలో తల్లిలా రైతుకు
ఆదరువు అవుతావు!
రైతే రాజంటూ
ముందుకు తోసేరా!
ధాన్యాలు, సంపదను
సిరులెన్నో కురిపిస్తావు!
వేడిసంతా దాచుకొంటూ సింగరేణిలో
సిరుల గనివి నీవమ్మా!
జీవులకు జీవనాధారమై
భాషలెన్నో భాసిల్లెను నీలోన
మధుర ఫలమ్ముల వంటి మహాత్ముల
కన్నావు!
ప్రకృతి పులకించే
సుందర దృశ్యాలెన్నో
నీరు నిప్పు గాలి నింగినేల
అన్నీ
మనిషి ఆత్మస్వరూపానికి
నీలో మెదిలేవే!
అవని నిండా
అనంత వింత సాగరాలెన్నో.

- పి. మౌనిక
బైపీసీ 2వ సం॥
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

స్నేహం

ఆపదలో ఉన్నప్పుడు ఆదుకునేవాడే
నిజమైన మిత్రుడు
మట్టిలో పుట్టి మట్టిలో కలిసేంత వరకు
తోడుండే చెట్టు!
స్నేహం ఒక భావం
భావం ఒక జీవం
ఆ జీవానికి ప్రతిరూపం స్నేహంలో
అనురాగం!
అదే జీవితమై, శాశ్వతమై
సన్మార్గంలో నడిపించి
జీవితాంతం తోడుండే ఆత్మబంధం!

- ఎ.రుచిత
10వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

అమ్మ

అమ్మ ఒక దేవత
ఆ దేవత ఇచ్చింది మనకు జన్మ
అమ్మ ఎక్కడైతే ఉంటుందో
అక్కడే ఉంటుంది స్వర్గం
అమ్మ ప్రేమ ఎంత విలువైందో
తెలిసి మసలుకుంటే
ఎవ్వరికైన కష్టాలు రావు!
అమ్మ ప్రేమ ఎంత మధురమైనదో
కడుపు తీపికి మాత్రమే తెలుసు!
అమ్మచేసే వంట రుచిగా ఉంటుంది
ఎందుకో తెలుసా!
అమ్మ దాంట్లో మనకు కనిపిస్తుంది
ప్రేమతో కూడిన బంధం
అందుకే అమ్మ ప్రేమ
అమృతం కన్న మిన్న!!

- ఎం. వరుణ్ తేజ
9వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్ జిల్లా: జగిత్యాల

మా ఊరి చెరువు

చెరువు చెరువు చెరువు
మా ఊర్లో ఉంది మా మంచి చెరువు!
నిండైన చెరువు
అవసరాలెన్నో తీరుస్తుంది!
అందులో ఉండు తామెర!
తామెర అంటే నాకిష్టం!
వాటి పువ్వులంటే ఇంకెంతో ఇష్టం!
నీటిపైన తేలుతుంది
మిలమిల మెరుస్తుంది
అందాన్నెంతో ఒలకబోస్తుంది!
మిలమిల మెరిసే పువ్వు
వర్షాకాలం వస్తేచాలు
తామరపువ్వుకు సంతోషం!
నీటితోనే చుట్టరికం!
చెరువు నిండుగ ఉంటేనే
పువ్వులు మిలమిల మెరుచు!
నిండుగ ఉండే చెరువు
ఉండదు ఎప్పుడు కరువు!!
ఊరికి అందం చెరువు
ఊళ్ళో అందరికి ఇష్టం చెరువు!!

-యశస్విణి
8వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

చెట్టు

అవనిలో గొప్పనిది వృక్షం
అది పెంచని మానవుడు వ్యర్థం!
వృక్షం ఆశిస్తుంది
తనని నాశనం చెయ్యొద్దని!
చెట్టను పెంచి దాని రక్షణకు
పాటుపడాలి
స్వార్థంలేని అమ్మ!
మనకు జీవితాంతం ప్రాణవాయువై
బ్రతికిస్తుంది!
ప్రతీమనిషి ప్రతినభూని
చెట్లు పెంచుటకై
ప్రభంజనమై కదలాలి!
దేశానికి రైతు,సైనికుడు
ఎంత అవసరమో
మానవ మనుగడకు అంతే అవసరం!!

- శృతిలయ
10వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

అమ్మ

మనను లాలించేది, పాలించేది
అమ్మ!
గోరుముద్దలు పెట్టి, ఒదార్చేది అమ్మ!
దైవత్వాన్ని మించిన దైవం అమ్మ!
కష్టాల్ని తీర్చేది
సంస్కారం నేర్పేది అమ్మ!
లక్ష్యాన్ని ఇచ్చేది, ఆకారాన్నిచ్చేది అమ్మ!
ఇన్ని చేసే అమ్మను
ఈ జన్మలో ఏ జన్మలో
నేను మరువను.

- బి. అపూర్వ
7వ తరగతి
ఇటిక్యాల మాడల్ స్కూల్
మం: రాయికాల్
జిల్లా: జగిత్యాల

తగుళ్ళ గోపాల్ రచించిన కవితా సంపుటి 'దండకడియం' పుస్తకావిష్కరణ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ప్రముఖ సాహితీవేత్త శివారెడ్డి మాట్లాడుతూ జీవితం నుంచి పుట్టుకొచ్చిందే దండకడియం అని అన్నారు. దండకడియం నేటి తరానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నారాయణ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యాకూబ్, నాగళ్ళ రమేశ్, వనపట్ల సుబ్బయ్య, మెట్టా నాగేశ్వరారావు, ఫనిమాధవి, కన్నోజు, పగిడిమర్రి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేటినిజం
సాహితీ కేరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 21-11-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

నమ్మలేని నిజాలు

కొలుష్యం ముప్పు
మృత్యువు నోట్లో తల
బతకే గాలి
ఎంత సుఖమో
తొడబిగుతు చెడ్డి
నరాల పాట
కొత్త జిగురు
కత్తికాట్లకు అతుకు
నైపుణ్య పుణ్యం
గుండె కాలింది
పంచ ప్రాణాల్లోవగ
ఉన్మాద దారి
జోడు గుర్రాలు
అవినీతి కత్తీలు
సవారి కష్టం

– రేడియమ్
9291527757

నిజాలు

ఆదేశించలేం ఏమి
చేయలేం యువరానర్!
ఆర్టీసీ సమ్మెకిపుడు
లేబర్ కోర్టు బ్యానర్!

ఎవడు దిక్కు ఎవడు మొక్కు
ఆర్టీసీ సమ్మె!
చివరాఖరకు మిగిలింది
కార్మికులకు దమ్మె!

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



భార్యాభర్తల బంధం... ఇగిరిపోని గంధం!

(నవంబర్ 27న ఆచార్య కడారు వీరారెడ్డి గారి దీర్ఘ కవిత ఆవిష్కరణ సందర్భంగా పుస్తక సమీక్షా వ్యాసం)

పెళ్ళంటే నూరేళ్ళ పంట! ఏడడుగుల బంధం.. మూడు ముళ్ళ బంధం.. పవిత్ర బంధం. పెళ్ళితో ఒక్కటయ్యే ఆలుమగల బంధం.. ఇగిరిపోని గంధం!

భారతీయ సంస్కృతిలో వివాహానికి విశిష్టమైన స్థానముంది. ఒకరికి మరొకరు.. నాకు నువ్వు.. నీకు నేను అంటూ అన్యోన్యంగా దాంపత్యం కొనసాగించడానికి భార్యా భర్తల బంధం అపురూపమైంది. అనిర్వచనీయమైంది. జీవితంలో పెళ్లి ఓ అద్భుత ఘట్టం! పెళ్ళితో ఒకటయ్యే జంట యొక్క బంధం.. జీవితాంతం కొనసాగించే ఓ గొప్ప స్నేహబంధం. ఇద్దరి ఆలోచనలు.. వైఖరులు.. అభిరుచులు.. అలవాట్లు.. అవసరాలు.. జీవన శైలికి సంబంధించిన వ్యవహారాలు.. వేరున్నప్పటికీ.. ఇరువురి మనసులు కలిశాక పరస్పర అవగాహనతో.. ఇరువురి అభిమతం అన్నింటా ఒకటై ఉంటే ఓ గొప్ప బంధం.. వివాహ బంధం. ఆలుమగలుగా అనిర్వచనీయమైన ఆత్మీయతను, అనుబంధాన్ని పెంచే ఓ గొప్ప సన్నివేశం.. అవకాశం.. పెళ్లి అనే బంధం. ఆ బంధం ఇగిరిపోని గంధంగా వెలుగొందుతూ.. కష్టనుఖాలను సమంగా పంచుకుంటూ.. దంపతులను ముందుకు నడిచేలా చేస్తుంది. మనసా, వాచా, కర్మేణా.. ఒక్కటిగా మసలుకునేలా చేసి మధుర అనుభూతులను ఒకరికొకరు పంచుకునే ఓ మహత్తర సంస్కారం వివాహం. సంతోషాల్లో పొంగినప్పటికీ.. కష్టాల్లో కుంగినప్పటికీ.. ఎప్పటికప్పుడు స్వచ్ఛమైన మనసుతో ఎడబాటసలే లేని సుఖమయమైన జీవన యానం చేయడానికి.. భేదాభిప్రాయాలను అప్పటికప్పుడే సర్దుబాటు చేసుకోవడానికి.. పరస్పర అవగాహనతో భార్యాభర్తలుగా మసలుకోవడానికి నిజంగా ఓ వరం లాంటిదే పెళ్లి!

దంపతులు యాంత్రికంగా కాక, జీవితాన్ని ఉల్లాసంగా.. ఆహ్లాదకరంగా కొనసాగించడానికి ఇద్దరికీ కావలసింది ఒకరి పట్ల మరొకరికి నమ్మకం.. విశ్వాసం.. అవగాహన!

బలాలు.. బలహీనతలు బయట పెట్టకుండా.. సమానత్వ సంకల్పంతో అడుగులు వేస్తూ.. ఆధిపత్యానికి తావివ్వని జీవన యానాన్ని కొనసాగిస్తే.. నిజంగా వివాహ బంధం.. ఆలుమగలకు పవిత్ర బంధమే కాదు.. ఇగిరిపోని గంధం! నమ్మకం.. గౌరవం భార్యాభర్తల బంధానికి ఆభరణాలు. నిలకడైన సంసారానికి నిబద్ధతే ఆలంబనం.. ద్వైతంలో అద్వైతానందాన్ని ప్రసాదించగలిగేది దాంపత్య బంధం. తనువులు రెండైనా.. మనసులు ఒకటైతే.. పగలే వెన్నెల జగమే ఊయలగా.. సాగుతుంది ఆలుమగల సంసారం. పాలూ తేనెలా కలిసి కాపురం చేస్తే.. నిజంగా ఏడడుగుల బంధం కలకాలం.. జీలకర్ర బెల్లం లాగా విడదీయరాని బంధంగా వెలుగొందుతుందంటూ.. ప్రముఖ కవి, కథకులు, బహుగ్రంథకర్త, విద్యావేత్త, శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కడారు వీరారెడ్డి గారు 'భార్యాభర్తల బంధం... ఇగిరిపోని గంధం' పేరుతో ఓ దీర్ఘకవితను పాఠక లోకానికి అందిస్తున్నారు. రసాయన శాస్త్రంలో, పరిపాలనలో, పరిశోధనలో, విశ్వవిద్యాలయ విద్యాబోధనలో అపార అనుభవం ఉన్న ఆచార్య కడారు గారు తెలుగు సాహిత్యంలో 2014 నుండి నేటి వరకు పదకొండు గ్రంథాలను వెలువరించారు. వీటిలో భాస్వరాలు, కాలం అడుగులు, అక్షరాప్పరసలు, తరంగాల అంతరంగాలు, మేఘాల తీరాన.. ఐదు వచన కవితా సంపుటాలైతే.. అందమా.. నినువర్ణింప తరమా, నిత్య యవ్వని, విశ్వనయన, పల్లెకు పోదాం పల్లీ, భార్యాభర్తల బంధం... ఇగిరిపోని గంధం.. ఐదు పుస్తకాలు దీర్ఘ కవితలకు సంబంధించినవి. తరం మారినా... పేరుతో కడారు కథాకెరటాలు వెలువరించి కథా ప్రక్రియను కూడా సుసంపన్నం చేసిన ఘనత వారికి ఉంది. ఆయన రాసిన రెండు గ్రంథాలు హిందీలోకి అనువదింపబడ్డాయి. వృత్తి పరంగా దశాబ్దాలుగా ఆంగ్ల భాషలోనే రచనలు చేయడం, సంభాషించడంలో మమేకమైన ఆచార్య కడారు గారు రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా తెలుగులో మొదలు పెట్టాక, అనతి కాలంలోనే ప్రతిభావంతంగా, ప్రభావవంతంగా రచనలు చేసే స్థాయికి చేరి తెలుగు సాహిత్యంలో కవిగా, కథకునిగా తనకంటూ ఓ స్థానాన్ని పదిల పరుచుకున్నారు. ఆచార్య కడారు గారు ఏ అంశాన్ని తీసుకున్నా ఆర్ద్రంగా అభివ్యక్తీకరించడంలో తమ సృజనాత్మక నైపుణ్యాన్ని ప్రదర్శించే స్థాయికి ఎదగడం ప్రశంసనీయ పరిణామం.

తమ పదకొండవ పుస్తకంగా ప్రస్తుతం వెలువరించిన 'భార్యాభర్తల బంధం... ఇగిరిపోని గంధం' దీర్ఘ కవితలోని ప్రతి పంక్తీ కవితాత్మకంగా కొలువుదీరడం విశేషం. ఆద్యంతం ఆసక్తికరంగా మలచబడిన ఈ దీర్ఘ కవితలో ఆచార్య కడారు గారి ఉత్తమ వ్యక్తిత్వం, ఉన్నత మనస్తత్వం... కవిగా వారు సాధించిన అభిలషణీయమైన పరిణతిని గమనిస్తాం.

ఈ దీర్ఘ కవితను పది భాగాలుగా విభజించి.. ఒక్కో భాగంలో.. వివాహ బంధానికి సంబంధించిన వివరాలను అద్భుతంగా అక్షరబద్ధం చేశారు.

మొదటి భాగంలో.. శిశు ప్రాయంలోని సరిగమలను వినిపించారు. అంబాడితే ఉరక.. అలసిపోతే పడక.. గాలి పరమాణువుల్లా.. అటో, ఇటో, ఎటో.. దశ, దిశ లేని మెదలికలను అక్షరాలలో అందంగా బంధించారు. బాల్యం ఓ మహోన్నత ప్రస్థానంగా పేర్కొంటూ.. శైశవ దశ నుండి పచ్చని మిసమిసల పరువం వరకు చేరే ఘట్టాలను చక్కగా పొందు పరిచారు. యవ్వనంలోకి వెళ్ళే నేపథ్యంలో సహజంగా మనిషి శరీరంలో వచ్చే మార్పులను.. రమణీయంగా చక్కని పద బంధాలతో తీర్చిదిద్దారు.

రెండో భాగంలో.. వినిపించని రాగాల మేళవింపుతో.. అగుపించని అందాలు మేల్కొనే అంశాలను ప్రస్తావిస్తూ.. యవ్వన దశ.. సౌందర్యానికి పరాకాష్ఠ, అమేయం.. అమోఘం, అసదృశం, అనిర్వచనీయం అంటూ కొనసాగించిన పంక్తులు ఆచార్య కడారు గారి సృజనాత్మక ప్రతిభకు పట్టం కట్టే విధంగా ఉన్నాయి. ఎనలేని తొలకరి అందాలను.. ఎగసి పడే వడ్డింపుల వైభోగాన్ని .. ఆవిష్కరించిన తీరు బాగుంది. యవ్వనంలో తనువులు నిండు తేనెలు పొదిగిన తుట్టెలని.. మధురిమలొలికే మధు పాత్రలని ఇలా యవ్వనంలోని మార్పులను, అనుభూతులను పాఠకులకు గిలిగింతలు పెట్టే విధంగా అక్షరాకృతి నిచ్చారు.

మూడో భాగంలో... తాళాలు మేళాల సందళ్ళు.. సంబరాలు.. సంతోషాల మధ్య జరిగే పెళ్లి వేడుకలను సుందరంగా దృశ్యమానం చేశారు. మనిషి జీవితంలో ఓ అపురూప ఘట్టంగా మూడు ముళ్ళ బంధాన్ని చిత్రించారు. మూడు ముళ్ళ బంధనం.. రెండు యంత్రాల ఏకీకరణ కాదు.. మూడునాళ్ళ ముచ్చట అంతకన్నా కాదు.. జన్మ జన్మలకు స్త్రీ పురుషుల ఆత్మల అనుసంధానమని చెప్పారు. ధర్మార్థ కామ మోక్షాలు.. శరీరాన్ని ఆశ్రయించిన ప్రతి జీవి పాటించాల్సిన నాలుగు పురుషార్థాలని తేల్చి చెప్పారు. ద్విత్వంలో ఏకత్వమే దాంపత్య జీవిత పరమార్థమని విడమరిచి వివరించారు.

నాలుగో భాగంలో... ఆదర్శ దాంపత్యానికి ఏమీ లేవు.. నిర్దిష్ట శిలా శాసనాలు.. అంటూ మార్గాలుభిన్నమైనా.. సారాంశం ఒక్కటేనని పేర్కొన్నారు. సూర్యుడు లేని పగలు, చుక్కలు లేని రాత్రులు.. ఎన్ని ఎదురైనా.. ఒకరి కళ్ళలో ఒకరికి అగుపించే వెలుగు నీడలే.. ఆలుమగల ఆశల ప్రపంచమని చెప్పారు.

అయిదో భాగంలో... పెళ్ళైన కొత్త జంటల సుఖ స్వాతంత్ర్యానికి చేసే ప్రేమ యాత్రలు.. ఓపలేని ఒంటరితనం, ఆపై.. ఆపలేని తుంటరితనం.. ఒకరినొకరు వదిలి ఉండలేనితనం.. సహజంగా కోరుకునేది నిర్మానుష్య ప్రదేశం.. రమ్యమైన నిశ్శబ్ద స్థలం.. అంటూ కొత్త మురిపెంతో నూతన వధూవరులు నిద్దరలేని రాత్రులతో గడిపే ఆహ్లాదాల కోలాటాల సవ్వడులను ఈ భాగంలో నిక్షిప్తం చేసి అందరినీ మెప్పించారు.

ఆరవ భాగంలో... భార్యాభర్తల మధ్య పెనవేసుకొనే ప్రేమ విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు. భార్యాభర్తల ప్రేమ.. అనంతంగా పారే జీవ నదిగా అభివర్ణించారు. ప్రేమ మనసును తడుముతుంది. గుండెను రంజింపజేస్తుందని ప్రకటించిన తీరు బాగుంది.

ఏడో భాగంలో బంధం బరువు కాదనీ.. ఒక బాధ్యతనీ.. అందమైన నమ్మకం అతీత స్నేహ సౌరభం అంటూ ప్రారంభించిన తీరు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది. సంసారం.. ఓ పద్మవ్యూహమనీ.. దాంపత్యంతో తొలి అడుగు బాహ్య వలయంలోకి.. మలి అడుగుతో లోతులు ఛేదించాలనే ఆరాటం అంటూ సంసారం యొక్క గొప్పతనాన్ని చాటారు. ప్రేమ, అనురాగం, నమ్మకం వంటి ఆభరణాలతో ప్రకాశించే ఆలుమగల బంధం.. చెట్టుకూ మట్టికి ఉన్న సంబంధంగా వర్ణించారు. శరీరం, మనసు, ఆత్మల అనుసంధానం.. ఆలుమగల బంధానికి శాశ్వత గంధం అని విడమరిచి చెప్పారు.

ఎనిమిదో భాగంలో... జీవితమంటే ఆషామాషీ వ్యవహారం కాదనీ.. ఎన్నో మలుపుల ప్రయాణమని తెలిపారు. కొత్తదనం కోరుకుంటేనే జీవితంలో మంచి మార్పుకు అవకాశం అనీ.. సుఖం వెల్లివిరిస్తే చుక్కల ఆకాశంలో చంద్రుడిలా.. జీవితమంతా వెలుతురు వాకిలేననీ చెప్పారు. అలాగే దుఃఖం ఆవరిస్తే మిణుక్కు మిణుక్కుమనే చుక్కలెన్ని ఉన్నా ఆకాశమంతా చీకటేనని తేల్చి చెప్పారు.

తొమ్మిదవ భాగంలో... ఎదిగిన వయసులో సరసం ఓ పసందైనపరాచికమనీ.. పరువాల పరుగులకు సంకేతాలని ఆవిష్కరించారు. ఈ భాగంలో ఆచార్య కడారు గారు ఆలుమగల మధ్య విరిసే హాస్యపు పూమొగ్గలను.. మనసు ఊయలలో ఓలలాడే ఉల్లాస, సరస సల్లాప భావాలను రమణీయమైన పద బంధాల్లో బంధించారు.

పదో భాగంలో... కరుగుతున్న కాలానికి.. పెరుగుతున్న వయసుకు.. మిగిలిపోయే జ్ఞాపకం వెల కట్టలేని ఆభరణంగా వర్ణించారు. తనువులు పొడబారితే సొలుగులు.. చింతలు ముదిరితే సణుగులు అంటూ జీవిత సత్యాలను అక్షరాలలో ఆలోచనాత్మకంగా బంధించారు. మనసు ఆత్మల అనుసంధానమే.. వ్యక్తిత్వం.. జీవితం అంటూ భార్యాభర్తల బంధం.. నిజంగా ఇగిరిపోని గంధంగా.. ప్రతిభావంతంగా, ప్రభావవంతంగా ఈ దీర్ఘ కవితలో ఆవిష్కరించారు.

దీర్ఘ కవిత నీక్వెన్స్ ఎక్కడా దెబ్బ తినకుండా.. ఓ క్రమంలో మనకు అందించడంలో ఆచార్య కడారు గారు సఫలీకృతులైనారు. ప్రతి ఒక్కరూ చదువ తగిన గ్రంథమిది. సంసారాలను, దాంపత్య జీవితాన్ని అన్యోన్యంగా మలుచుకోవడానికి ఉపకరించే గ్రంథమిది. పెళ్ళిళ్ళలో ప్రతి నవ జంటకు అందజేయాల్సిన దీర్ఘ కావ్యమిది. ఆలుమగల బంధ విశ్లేషణలో ఆచార్య కడారు గారు చూపిన ప్రతిభను.. లోక పరిశీలనను.. అందరూ ప్రశంసిస్తారు. ఓ పరిణతి సాధించిన కవిగా సాహితీ లోకంలో స్థిరపడేలా ఈ గ్రంథ రచన చేసిన ఆచార్య కడారు గారికి శుభాకాంక్షలు తెలుపుదాం.

పేజీలు:88, వెల: రూ. 100
ప్రతులకు: ఆచార్య కడారు వీరారెడ్డి
ఇం. నెం.: 8-12-20, బృందావన్ నగర్
రోడ్ నెం.: 8, హబ్సిగూడ,
హైదరాబాద్ - 500007
మొబైల్: 9392447007

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

ఓసీ, ఎండిపోయిన మేఘమా!

నింగి కెక్కకుండా
పొద్దెక్కే వేళకుకూడా
చీకటి ముసుగు తొడిగి
సూర్యుణ్ణి దాచిపెట్టా ననుకుంటున్న మేఘమా!

మధ్యాహ్నమైనా సరే
నల్లని దుప్పటితో
ఇంకా కప్పిపెట్టానని
తృప్తి పడుతున్న మేఘమా!

సాయంత్రం పడమటి కొండల ఆవలకు
విశ్రాంతి కోసం వెళ్ళిపోయేదాకా
గట్టిగా కౌగిలితో బంధించి
సూర్యుడు నేలను చూడకుండా
గెలిచా ననుకుంటున్న మేఘమా!

ఓసీ, ఎండిపోయిన ముఖానికి
మేకప్ వేసుకొన్న మేఘమా,
సూర్యుడు ఉదయించీ ఉదయించకముందు నుంచే
కప్పి పెట్టా ననుకునే నిన్నూ
కలుష వాయువు ప్రవహించే నీ గుండెల్నీ చీల్చి
నేల మీదకు నిశ్శబ్దంగా
దూసుకొస్తూనే వున్నాయి సూర్యుడి కరాలు,
వ్యవసాయం చేసి భూగోళాన్ని
బతికిస్తూనే ఉన్నాయి అక్షర కాంతి కిరణాలు.

–డా. రావి రంగారావు
9247581825

పురస్కారాలు ఎంతో ప్రోత్సాహవంతం

–ఆచార్య కొలకలూరి ఇనాక్

పురస్కార గ్రహీతలతో అతిథులు ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥ చిల్లా రాజశేఖరరెడ్డి, గుదిబండి వెంకటరెడ్డి, వి.వి.రాఘవరెడ్డి తదితరులు.

పురస్కారాలు ఎంతో ప్రోత్సాహవంతమైనవని, సమాజం కోసం కృషి చేసే కృషీవలురులను గుర్తించి సత్కరించడం అభినందనీయమని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు.

జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్తాధ్వర్యంలో ప్రతిభ, ఆప్తమిత్ర పారితోషక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం రాత్రి గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో ఆ సంస్థ అధినేత గుదిబండి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

ముఖ్య అతిథిగా శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యా లయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ హాజరై ఈ పురస్కారాలను ప్రదానం చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో సర్వేజనా సుఖినోభవంతు సేవా సమితి స్థాపన అధ్యక్షుడు లంక ఫణికుమార్ శర్మ, కవి, రచయిత (గుంటూరు) సయ్యద్ జాని భాషా, కవయిత్రి పద్మశ్రీలత, నిర్వాహక సంస్థ ప్రదాన కార్యదర్శి వి.వి. రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ జానపద కళాకారుడు ఆర్. సైదులు ఆధ్వర్యంలో జానపద, దేశభక్తి, గీతాలాపన అందరిని అలరించింది. అనంతరం మానసిక ఒత్తిడి, ధ్యానం అంశాలపై డాక్టర్ ఎ. శ్రీనివాస్‌రెడ్డి అద్భుతంగా ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రతిభా పురస్కారాలను అభినందన నెలకొల్పిన పారితోషిక పురస్కారాన్ని 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు, డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు (గుంటూరు), నెలకొల్పిన పురస్కారాన్ని తెలుగు కోకిల గాయని భూదేవికి అందించి గౌరవించారు. అదే విధంగా సయ్యద్ జానీ భాషా నెలకొల్పిన పురస్కారాన్ని సయ్యద్ జహీర్ అహ్మద్ (రచయిత, గుంటూరు)కు అందించగా జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త డాక్టర్ రావూరి భరద్వాజ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రావూరి వెంకట కోటేశ్వరరావు ఔత్సాహక రచయితకు నెలకొల్పిన పురస్కారాన్ని రచయిత పెద్దోజు నాగేశ్వరరావుకు అందించారు. స్వర్గీయ కళ్ళం వెంకట్‌రెడ్డి స్వర్గీయ విజయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి బంధువులు ఎ. శ్రీనివాసరావు నెలకొల్పిన పురస్కారాన్ని ధనుష్ (9వ తరగతి)కు అందించి గౌరవించారు. ఈ సభలో కళా పోషకులు డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు.

మనసు మృగ్యం

–మనిషి మృగం

తల్లినే కడతేర్చే క్రూర కూతురు
బిడ్డ పీకనులిమే కసాయి తల్లి
కన్నోళ్లను సజీవదహనం చేసే పుత్రుడు
పెనిమిటి పీక పిసికే ఆలి
కూతుర్నే కోర్కె తీర్చమనే తండ్రి
అమ్మరొమ్ముకేసి అసహ్యకన్నేసే కొడుకు
మానవత్వమే మృగ్యమైన మృగాలు
క్రూరజంతువులే సిగ్గుపడే పాడు పనులు
మానవ ముసుగుల్లో దానవదాష్టికాలు
హద్దులు దాటిన ఆటవికన్యాయాలు
సాంతం ఇంకిన మానవత్వ ఊటలు
వావివరసలు లేని అమానుష మనుషులు
తన వారే తలారులు..యమదూతలు
కుటుంబపుస్తకంలో ఎర్ర సిరా మరకలు
అశ్లీల రక్తసంబంధాలు..రోత ఆలోచనలు
మరగుజ్జు కుటుంబాలు..మృగమనుషులు !

అంతర్జాలం చిమ్మే అనైతిక ఉప్పెనలు
విషపు సాలెగూట్లో యువత విలవిలలు
ట్యూబుల్లో చిక్కి ఊపిరాడని పసికూనలు
నీలి సంద్రంలో నేటి యువత ఈతలు
కట్టుబాట్లను ఛేదించే అశ్లీల తప్పటడుగులు
అపరిచిత బంధాలు..విశృంఖల చేష్టలు
తెగిన సంబంధాలు..బరితెగించిన భావాలు
మా'నవ' చరిత్రకే మాయని మచ్చలు !

ప్రేమానురాగాల పోగుల్ని ఏర్చి..కూర్చి
గృహాల్లో ఆనంద హరివిల్లులు కురిపిస్తూ
ఇంటర్ నెట్ తెరిచి జ్ఞాన యజ్ఞం చేసి
యువత నైపుణ్యతను అందగా చేసుకొని
స్వర్ణభారతి నిండా సద్గుణరాసులు పరచి
లోకానికే దీపస్థంభమై దివ్యంగ వెలుగాలె !

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

నిజాలు!

కాలి బాటల వెంట
ఎంత కాలం... నడక
రహదారి ఎక్కి
గమ్యాన్ని చేరుకో!

పిల్ల కాలవలు, వాగులూ
నదిని చేరాకే
సముద్రాన్ని అందుకున్నాయి!!

–మునిమడుగుల ఫిలాసఫీ

మద్దతెరుగక గుండె మంట–
మిరప పరుపె సేదతీర్చేనంట.
పయ్య తోలిన తన్మయ బాల్యం–
ఏ పల్సర్ నడుపూ, సరితూగదు మూల్యం.
సైనికుల సంగీత–
తుపాకులే గిటార్లై.,బుల్లెట్లే ఫ్లూట్లై.
కళ్ళప్పగించడమ–
చేనే కంచెను మేస్తోందన్న చోద్యం చూస్తూ.
గడపకో భారతీయుడు–
మనిషిమనిషిలో ఓ అపరిచితుడు.
మారణహోమం అడుగడుగూ–
మానవత చుట్టూ నెత్తుటి మడుగూ.
బ్రతుకు జ్యోస్యం–
కాలుష్యం కోఅల్లో,కల్తీ సరుకుల్లో.
కాదేదీ కల్తీకనర్హం–
వస్తువులేనా, మనిషి మస్తకాలూ.
మోసం మామూలే వ్యాపారాన–
ఎంత బేరానికి అంత లాఘవం.
జారిపడక తప్పదు–
కన్నూమిన్నూ కానని నడతలో, నడకలో.
వయోభారం బ్రతుకు ఘోరం–
మనుగడ రణమై,మరణం శరణమై.
నేను కాలిపోతా చితిలో–
నా కలం చిరంజీవి, ఈ జగతిలో.
స్మార్ట్ ఫోనైనాడు మనిషి–
కోతి నుండి పరిణామం చెందినట్టు.
ఎదురులేదు ఎదుట పడ్తే–
నువ్వే దేవుడివి కడుపుకింత పెడ్తే.
మనం మనలానే ఉంటే సరి–
స్వచ్ఛంగా,స్పష్టంగా,ఇష్టంగా,స్ఫటికంగా.
జీవితం ఓక్షణమే–
నేస్తమా గ్రహించు, అది ఈ క్షణమే.

–గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

పాట

ప్రజల మేల్కొల్పేది పాటరా
ప్రజల నడిపించేది పాటరా
ప్రజల కాపాడేది పాటరా
ప్రజల బ్రతికించేది పాటరా
గర్వమును దించేది పాటరా
ధర్మమును నిలిపేది పాటరా
ధనము నెదిరించేది పాటరా
జనుల గెలిపించేది పాటరా
అన్నార్తులకు అండపాటరా
కన్నీళ్ళు తుడిచేది పాటరా
దానవత నెదిరించు పాటరా
మానవత వెలిగించుపాటరా
రైతు శ్రమజీవనంపాటరా
శ్రామికుని చెమ్మటే పాటరా
జాతి చైతన్యమే పాటరా

జాతీయ భావనే పాటరా
ఉదయాన్ని రప్పించుపాటరా
హృదయాన్ని కదిలించుపాటరా
మార్పుకై ఉప్పొంగుపాటరా
మార్పునే ఘోషించు పాటరా
నివురు గప్పిన నిప్పుపాటరా
నింగిదాకా మండుపాటరా
ప్రజల మేల్కొల్పేది పాటరా
ప్రజల నడిపించేదిపాటరా
పాటయే మన బ్రతుకు బాటరా
పాటయే జ్ఞానంపు ఊటరా
చైతన్య గంగయే పాటరా
జాతీయ గీతమే పాటరా
పాటయే మన బ్రతుకు బాటరా
పాటయే మనమెతుకు బాటరా
ప్రజల మేల్కొల్పేది పాటరా

ప్రజల నడిపించేది పాటరా
విశ్వజన గీతమే పాటరా
విశ్వజన శ్రేయమే పాటరా
ఎల్ల లెరుగని దెప్పుడు పాటరా
ఎల్లరినీ నడిపేది పాటరా
దేశాల కలిపేది పాటరా
ఎల్ల లెరుగని దెప్పుడు పాటరా
ఎల్లరినీ నడిపేది పాటరా
ప్రజల మేల్కొల్పేది పాటరా
ప్రజల నడిపించేది పాటరా!

–డా॥ తిరునగరి
93924 65475

ఆఖరి అవకాశం

అనుక్షణం ప్రాణవాయునిచ్చే
అపర అవధూతలు.. పచ్చని చెట్లను
ప్రేమతో పెంచడానికి బదులు
మరింతగా సుఖించాలనే లాలసతో
పదునైన గొడ్డలిగా మారుతుంటివి!

అడిగినా అడక్కున్నా ఉచిత సేవలందించే
ప్రకృతి వరాలు.. పశు పక్ష్యాదులను
పిల్లల్లా ముద్దు చేయడానికి బదులు
మిక్కిలిగా లబ్ధి పొందాలనే దురాశతో
యమ కింకరుడిగా అవతరిస్తుంటివి!

సహజ వనరులతో సదా సహాయ పడే
అక్షయ పాత్రలు.. కొండలు, నదుల్ని
కంటి పాపల్లా కాపాడుకునే బదులు
సొంతం సొంతం చేసుకోవాలనే స్వార్థంతో
కబ్జా పిశాచిగా రూపు దాలుస్తుంటివి!

అతి నీల లోహిత కిరణాల నడ్డుకునే
రక్షా కవచం..'ఓజోన్'కి చిల్లు పడిందంటే
తక్షణ నివారణ కుద్యమించడానికి బదులు
చిల్లు నా జేబుక్కాదు కదాని
'నీరో'లా నిమ్మకు నీరెత్తి నట్లుంటివి!

కాలుష్యం పరాకాష్టకు చేరగా
మిత్రుల్లాంటి మేఘాలు.. ఆమ్ల వర్షాన్ని కురిపిస్తుంటే
తప్పిదాల్ని దిద్దుకునే బదులు
జడివాన కురిసినా కదలని
ఎనుబోతులా నిలుచుంటివి!

మండే ఎండలని.. ముంచే వానలని
ఏ మెరుగనట్లు.. ఇప్పుడూ వాపోతూ
ఇంకా నిన్ను నువ్వు మోసగించుకునే బదులు
సత్వర పాప ప్రక్షాళనకుపక్రమించు!
సంస్కరణ కిదే
ఆఖరి అవకాశమని గ్రహించు!

– ఎస్.కాశింబి
9052216044

కైతికాలు

గోపాల్ నగర్ నందు
దోమలకు రక్తం విందు
ప్రజలందరూ దాతలు
దోమలకు భలే పసందు
వారెవ్వా దాన శీలురు
పీడిత బాధితులు

దోమలు నిస్తున్నాయి
కారకాల వ్యాధులు
ప్రజలందరూ భలేగా
తింటున్నారు మాత్రలు
వారెవ్వా దోమలు
నిస్తున్నాయి రోగాలు

ఏరియా ఆసుపత్రి
ఉత్సవ విగ్రహమయింది
రోగుల చికిత్సకు
పనికి రాని భవనమది
వారెవ్వా ఆసుపత్రి
ప్రాణాలు తీసే గోతి

నర్సింగ్ హోములో
వైద్యులందరు బిజీ
వ్యాధులతో ములుగుతూ
రోగుల అందరూ బిజీ
వారెవ్వా వైద్యులు
సంపాదనలో ఘనులు

అధికారులు చూడరు
వినతి పత్రాలు నిచ్చిన
ఏమి పట్టించుకోరు
లాభం లేదు నిచ్చిన
వారెవ్వా అధికారులు
మౌన వ్రతం దారులు



–జాధవ్ పుండలిక్ రావు
9441333315

మనోధైర్యం

సమస్యలు వరదలై
పారుతున్నపుడును
గుండెబద్దలవ్వకుండ
ధైర్యం చెదరకుండను
చేపవలే ఎదురీదినా
సమస్యలు తొలగిపోవు

ధైర్యం నీకండగా
కొండవలే నుండగా
సమస్య ల కత్తులు
చితైపోతాయిగా
ధైర్యవంతులందరు
సిరిని కలిగి ఉందురు

సమస్యలు సంకెళ్లై
బంధించి ఉంచినపుడు
భయంతో భతుకవద్దు
పోరాడుట మానకెపుడు
జీవితమనే వలయం
పోరాటాలమయం

గుండె చెరువైనను
పోషణ భారువైనను
అధైర్యపడవద్దు
ఆశతోని బతుకవలెను
సమస్యలను దాటిన
స్వర్గ మౌను బతుకు

పిరికితనంతోబదికిన
కర్ర పామైకరచును
ధైర్యంగా ఎదిరించిన
సమస్యలు పరిగెత్తును
పిరికితనం మానవలెను
ధైర్యంగా బతుకవలెను

వరదభీకరమైన
వదలకుండచేపలు
ఎదురు పడి ఈదినట్టు
ఎదురొచ్చిన సమస్యలు

వీడకుండ పోరాడి
సమస్యలు జయించాలి

అమావాస్య చీకటి
ఆవరించి బతుకును
అతులకుతులంజేసిన
ఆశతో బతుకవలెను
చీకట్లు తొలగిపోవు
చిరునవ్వులు వికసించు

–మొగిలి శ్రీనివాస్
9491746700

నేటి నిజాలు

పుస్తక సమీక్షలు

'కన్నోజు' కథలు 'ఇక్కడంతా క్షేమం' వాస్తవ జీవన చిత్రాలు



"తాగుడు బందయినంక, కూలిపైసలు మస్తు మిగులుతున్నట్టని పిచ్చినా ఎక్కువ కూలికొరకు పట్నం జేరుకొని బతుకుతున్న వాళ్లకిప్పుడు సర్కారోల్లు డబుల్ బెడ్‌రూం ఇల్లిస్తరని దరఖాస్తు గూడ బెట్టుకున్నరు" ప్రముఖ రచయిత కన్నోజు లక్ష్మీకాంతం 'గీతాగుడు సంగతేంటి' కథలో ముగింపు అది. 'ఇక్కడంతా క్షేమమే' కథా సంపుటిలో కవి, సమీక్షకుడు, హాస్య వ్యంగ్య రచయిత కన్నోజు లక్ష్మీకాంతం 22 కథలు ప్రచురింపచేసారు. కొన్ని హాస్యం, వ్యంగ్యం మిళితమైన ఈ కథలతో, వాస్తవికత కళ్ళముందు కదులుతూ ఎన్నో జీవిత సత్యాలను వైవిధ్యభరితంగా రచయిత ప్రతిబింబింపచేస్తారు. ప్రతికథలో భార్యాభర్తల అనుబంధాలు, కష్టసుఖాలు, చెళుకులు చమత్కారాలు కుటుంబ జీవన వైచిత్రి కథలను నడిపిస్తుంది. వివిధ పత్రికలలో ప్రచురితమైన ఈ కథలు, అచ్చ తెలుగులో అందమైన తెలంగాణ పలుకుబడి, యాసతో చదువరులను ఆకట్టుకొంటున్నాయి. పోస్ట్‌కార్డ్ కథగా అవార్డు పొందిన 'ఇక్కడంతా క్షేమం' కథలో అత్తింటిలో వున్న కూతురు అమ్మ, నాన్నలకు రాసిన కార్డులో "ఎంత బాగా మీరు పెంచినా 'ఆడ' పిల్లను గదా!" అంటూ వ్యక్తీక రించటం, "అంతా క్షేమం" అనటం రచయిత హృదయార్ధ్ర స్పందనను వ్యక్తీకరిస్తోంది. దైనందిన జీవితంలో ప్రతి కుటుంబం ఎదుర్కొంటున్న వాస్తవిక సమస్యలను కథలలో పాత్రల ద్వారా సందేశాత్మకంగా సృష్టించగలగటంలో రచయిత కృతకృత్యులయ్యారు. ఈ సంకలనంలో శీర్షికలన్నీ సూటిగా పలకరిస్తాయి. మునిమాణిక్యంగారి కాంతం కథలనడవడికలో భార్యా భర్తల హాస్య, వ్యంగ్య సంభాషణలు నర్మగర్భంగా ఆకట్టు కొంటాయి. "అమ్మా! నువ్వు అందంగా లేవు" కథ హృదయాన్ని కదిలిస్తోంది. అడ్డదిడ్డంగా బండి నడిపేవారి సంఘం 'అ.ది.బ.న వారి సంఘం' వంటి కథలు హాస్య కథల పోటీలో అవార్డు పొంది ప్రస్తుత సమాజ నడ వడికను స్పష్టం చేస్తున్నాయి. హాస్యాన్ని పండించటంలో రచయిత ప్రతిభావంతులని 'సుబ్బుపెళ్ళి సుందరాంగినితోనే, రాజీకయం ప్రధాన ఇతివృత్తంగా శివ(మ్మ) రాజకీయం, విద్యుత్‌రావుకు పెళ్ళి జరిగింది, అన్నదాత ఏడ్చినా, ఆడపడుచు ఏడ్చినా అరిష్టం అంటూ సామాజిక అన్యాయాలను వ్యతిరేకించే సందేశాత్మక కథ 'ఎవరూ చావద్దు' ఈ సంపుటిలో కథలన్నీ ఆణిముత్యాలే.

ప్రతులకు: కన్నోజు లక్ష్మీకాంతం
18-3-463/1/175/1,
రాజన్నబావి ఫలక్‌నుమా
హైదరాబాద్-500 053.
సెల్: 9246338115

–జయసూర్య
సెల్: 9440664610

సూర్య ప్రకాశంలో పదకొండగురి ఆత్మకథలు

'ఆత్మకథ" అంటే స్వీయ లిఖిత చరిత్ర. స్వజీవ, సజీవ చిత్రణం. జీవన సారాంశం. జీవన ప్రసానంలోని ఉదయ, మధ్యాహ్న సాయంత్రాల వివరణ. ఈ ప్రయాణంలో ఎదుర్కొన్న, కష్టసుఖాలు, ఖ్యాతి, అసఖ్యాతుల బేరీజు, పోరాట ఆరాటాలు ఉద్వేగ, ఉద్రేకాలు తమను తాము పునః పరిశీలించుకుంటూ బొమ్మ కట్టిన ఉత్తమ పురుష కథనం.

ఆత్మకథలు కూడా సాహిత్యంలో ఒక భాగమే! కొన్ని ఆత్మ కథలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు కూడా వచ్చాయి. జీవితానుభవమధన రసామృతాన్ని, స్వపక్ష, విపక్ష అనే బేధం లెక్కించకుండా, పంచే ప్రక్రియ. ఆత్మకథలెప్పుడూ, అసంపూర్ణమే! ఎందుకంటే ఆత్మకథకుడి ఆత్మకథ రచన తర్వాత కూడా కొంత జీవితం మిగిలే ఉంటుంది కనుక!

ఆత్మకథల్ని ఎందుకు చదవాలి? అన్న ప్రశ్నకు సమాధానంగా ఇవి ఎన్నో పాఠాల్ని నేర్పుతాయి. ఆ, యా మహనీయులు తమ జీవితాల్లో, ఆనంద విషాదాలను ఎలా ఎదుర్కొన్నారు. ఎదురైన సమస్యల్ని ఎలా పరిష్కరించుకున్నారు? ఎందువలన వారు తరువాత వారికి ఆదర్శవంతులైనారు? అన్న ప్రశ్నలకు పాఠకుడికి సమాధానాలు దొరుకుతాయి. చదువరి మానసిక పరిధి విశాలమవుతుంది. విస్తృత మవుతుంది.

బెంజమిన్ ఫ్రాంక్లిన్, నెల్సన్ మండేలా, మార్క్ ట్వెయిన్, హిట్లర్ అబ్దుల్ కలాం లాంటి మహనీయుల



ఆత్మ కథలు ఇప్పటికీ పచ్చగా వెలుగుతూ, ఎందరికో స్ఫూర్తిదాయకాలు అనటం విశేషం.

ఒక అంచనా ప్రకారం తెలుగులో రెండు వందలపై చిలుకు ఆత్మకథలున్నాయట! రచయిత ఆప్కారి సూర్యప్రకాశ్‌గారు వీటిని జల్లించి, తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రజాదరణ పొందిన పదకొండుగురి ఆత్మకథల్ని, తాళ్ళ శ్రీకాంత్, ప్రసాద్ కొమ్మూరిగారల సంపాదకత్వంలో మన ముందుకు తెచ్చారు. సప్తతి పూర్తి చేసుకున్న సూర్యప్రకాశ్‌గారు, పలు కవితా సంపుటాలు, ఒక వ్యాస సంపుటిని వెలయించి తెలుగు పాఠకుల అభిమానాన్ని గెలుచుకున్న అధ్యాపకులు పలు అవార్డులు రివార్డులు గెలుచుకున్న విశ్రాంత ప్రిన్సిపాల్. ఉద్యోగరిత్యా మనుషుల్ని, అందునా యువతను చదివిన ప్రతిభాశాలి. నిజామాబాద్‌లో 1969లో స్థాపించబడిన ఇందూరు భారతికి వెన్నెముక. సుమారు రెండు వందల సంవత్సరాలు వెనక్కువెళ్ళి కందుకూరి వీరేశలింగం గారి స్వీయ చరిత్రముతో మొదలిడి నిన్న మొన్నటి ఇద్దరు మిత్రులు– బాపు రమణల– కోతి కొమ్మచ్చితో ముగింపు పలికారు.

సంకలనంలో పదుగురివి స్వీయ చరిత్రలున్నాయి. ఆ పదిలో "కోతి కొమ్మచ్చి"లో ఇద్దరు–అనగా ముళ్ళపూడి వెంకటరమణ మరియు సత్తిరాజు లక్ష్మినారాయణ (బాపు)గారల జీవిత చరిత్రలున్నాయి. ఏనుగుల వీరాస్వామయ్య రాసిన "కాశీయాత్ర చరిత్ర" ఆయన జీవిత చరిత్ర అనటంకంటే యాత్రా చరిత్ర (ట్రావెలోగ్) అనటం సమంజసం.

ఈ పదుకొండు "ఆత్మకథ"లను మనముందుకు తేవటంలో రచయిత సూర్యప్రకాశ్ తనదైన శైలి, మెయిన్‌టెయిన్ చేయటంవల్ల ఆసాంతం ఏకత్వం గోచరిస్తుంది. అతుకుల బొంతలా అనిపించదు. ఆ,యా రచయితల గురించి ఎన్నో కొత్త విషయాలను పాఠకుడు తెలుసుకోగలుగుతాడు. బిరుదులు మనిషికి గర్వాన్ని కలుగచేస్తాయి కనుక, చిలకమర్తివారు బిరుదును తిరస్కరించారట! శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు స్త్రీల సంభాషణ పరమ శ్రద్ధగా వినేవారట! గజం ఎత్తు పుస్తకాలను రాయాలన్న తపన ఉంటేదట. దాశరథిగారు అంగారాన్నీ, సింగారాన్నీ సమంగా పండించారట. తిరుమల రామచంద్రగారు వివిధ ప్రాంతాలను దర్శించటం ఒక యజ్ఞంగా భావించే వారట. వీరి ఊతపదాలు "వలె-వలె" మరియు "ఎక్కి తక్కి". సామల సదాశివగారి 'యాది' ఒక నిసర్గ రమణీయుడి తెలంగాణ ఆర్తి. కోతి నిలకడగా ఉండక ఒక కొమ్మ నుంచి మరో కొమ్మకు గెంతుతుంది. అలాగే కోతికొమ్మచ్చి (మూడు భాగాలు) ఒక క్రమపద్ధతిలో సాగుకున్నా పాఠకుడికి విసుగు తెప్పించదు. సరికదా నవ్విస్తుంది. కవ్విస్తుంది. గిలిగింతలు పెడుతుంది.

"ఒక మహా పురుషుని, మహత్వ విశిష్టతను తెలుపుటకు రాయబడినకథ యే జీవిత చరిత్ర" అని చిలకమర్తివారు అంటే ఈ సంకలనం సూర్యుని దగ్గగామ మాన ప్రకాశమనవచ్చును.

ప్రతులకు: ఆప్కారి సూర్యప్రకాశ్
'సూర్యవీణ', ఫ్లాట్ నెం.33,
ఇ.నెం.8-7-195/5
పి.వి.ఎన్‌క్లేవ్, సమతనగర్, పాత బోయినపల్లి,
సికింద్రాబాద్-500 011
సెల్: 7997808178



–కూర చిదంబరం
సెల్: 8639338675

తీయనైన "తెలంగాణ నాగేటి చాళ్ళు"



అనుమాండ్ల భూమయ్య మంచి పద్య కవి. పద్యం, గేయం, వచన కవిత అన్నింటిమీద తమదైన శైలిని కనబరచే వీరు అక్షరాలా అక్షర కవులు. సృజనాత్మకమైన రచనలు చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. కవిగా, విమర్శకునిగా, ఆచార్యునిగా వీరి ప్రతిభ కనబరిచే తీరు కడు ప్రశంసనీయం. సాటికవిని కవిగా కూడా అంగీకరించని ఈ రోజుల్లో గొప్ప కవిగా పిలవబడే నందిని సిధారెడ్డి గారు రచించిన కవితా సంపుటిపై రచించిన విమర్శనా గ్రంథం రచించడం అనేది అందరూ హర్షించదగిన పరిణామం. ఈ గ్రంథం సిధారెడ్డి గారికి కానుక కావచ్చు కానీ అంతకంటే ముఖ్యంగా యువకవులకు, రాబోయే తరాలకు ఈ గ్రంథం అమూల్యమైన కానుక అని చెప్పవచ్చు.

"చెట్ల సిగలో మెరుస్తున్న పాలపిట్టల ప్రపంచం" చెట్టు కొమ్మల్లో వున్నప్పుడు లేని అందం సిగలో వున్నప్పుడుంది అని తెలిపే కవి సిధారెడ్డి రైతు కుటుంబంలో పుట్టి, బతకడం కోసం నాగలిని మోసి, బతికించడం కోసం నాటు తుపాకిని మోయడం, నిజాం సర్కారు పెట్టే బాధల నుండి రక్షా కవచంగా వాడుకున్న తుపాకీని కేవలం దౌర్జన్యాన్ని ఎదిరించడానికి వాడారని తెలిపారు. **"బరి వాతల ఆ బక్క భుజం/ నాగలి మోసింది/ నాటు తుపాకి మోసింది/ ఊర్కోలేక ఊరు ఉద్రేకాలను మోసింది"** అని తెలిపిన తీరులో ఎంతటి ఆర్ధ్రత ఉందో తెలిపారు. దాదాపు ఏడు కవితా సంపుటాలను రచించిన కవి, విమర్శకులు ఏడింటిలో మొదటి ఆరు, వచన కవితా సంపుటిలు, ఏడవది గేయ సంపుటి. దీన్ని నందిని సిధారెడ్డి పాటలుగా తెలిపారు. వీరి కవిత్వంలో ఉన్న నూతనత్వం, సహజత్వం వేరెక్కడా కనిపించదనే భూమయ్య అభిప్రాయ పడతారు. అలాగే రెండు వ్యాస సంపుటాలు, కథల సంపుటి వీరి కలం నుండి ఆవిష్కరింపబడ్డాయి.

సిధారెడ్డి గారి కవిత్వంలో కనిపించే లక్షణాలు బాధ, విప్లవం, కవితా రూపం ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా రైతుల కష్టాలు కొలిమిలో తపిస్తున్నట్టు కనిపించాయి. 'భూమి స్వప్నం, రుతుపవనం అనే ఖండికల్లో పర్రెలు వారిన పొలంలోని పంట పచ్చగా ఉంటుందా; ఎండిపోయిన పంట రంగు ఇసుక రంగులానే వుంటుంది. ఎటు చూసినా ఎక్కడా పచ్చదనం లేదు. అంతా ఎడారే అవ్వటంతో ఈ కవి గుండె ఆర్ధ్రమై అక్షర ప్రవాహమై ప్రవహించిన తీరు తేటతెల్లం చేసారు. అలాగే బతుకుతీపి, సారె మీది మట్టి, ఆర్ధ్రత, సంస్కారం, స్మృతి, చెరువు లాంటి శీర్షికలతో ప్రముఖ కవి అద్భుతమైన విశ్లేషణ చేసారు. సిధారెడ్డి కవిత్వపు నాడిని పట్టుకుని వివిధ రకాల వర్ణనలతో వివరించడం ఎంతో బావుంది. **"దు:ఖం రహస్యంగా పంచుకోక తప్పని దేశంలో/ జీవిస్తున్నందుకు దు:ఖిస్తున్నా"** అనే ఒక్క వాక్యం చాలు సిధారెడ్డి కవిత్వపు స్థాయి ఎంత ఎత్తులో ఉందో అని తెలుసుకునేందుకు.. అలాగే **"ముళ్ళేంది/ మనుషులు నడిచే తొవ్వల / పూలు పరుద్దామనుకున్నప్పుడు" మన తల్లి/ మన మట్టి తల్లి/ చెక్కిళ్ళమీద చారికలు"** ఇంతకంటే ఏం కావాలి కవిత్వానికి అనిపించక మానదు. ఇలాంటి వాక్యాలు ఒకటి కాదు. రెండు కాదు ఇలాంటివి ఈ గ్రంథంలో అనేకం ఉన్నాయి. చదివిన వారికి చదివినంత... అర్థం చేసుకున్నవారికి అర్థం చేసుకున్నంత.. అనిపించేలా పట్టు తివాచీల్లా ఈ గ్రంథం నిండా పరుచుకున్నాయి. ఈ గ్రంథాన్ని సమీక్షించాలంటే పదిపేజీలైనా సరిపోదు. కానీ లఘు సమీక్షకు పూనుకుని, అసలైన కవిత్వాన్ని చదవాలనుకునేవారికి కూడా అవకాశం అందిస్తున్నాను. ఈ కవిత్వపు ఎడారిలో అక్కడక్కడా కనిపించే ఒయాసిస్సులాంటి కవిత్వం లేకపోలేదు. కానీ వాటిని గుర్తించడం అనేది మనసైన వారికే కుదురుతుంది. ఇలాంటి కవిత్వాన్ని గుర్తించి, తమ అమూల్యమైన విశ్లేషణతో భూమయ్యగారు ఒక రకంగా పట్టాభిషేకం చేసారనే చెప్పాలి.. భూమయ్య గారికి అభినందనలు.

ప్రతులకు: ఎ. మనస్విని దేవి
ఫోన్: 7032668966
మరియు నవోదయ బుక్ హౌస్

–శైలజామిత్ర
9290900879

పెళ్ళిరోజు పర్వదినం

మరువలేని మరుపురాని పెళ్ళిరోజు!
అది ఒక తీయని జ్ఞాపకాల రోజు!!

అనురాగం ఇంటర్నేట్‌లో
అవగాహన వెబ్‌సైట్‌లో
ఆనందాన్ని ఆస్వాదించడమే పెళ్ళిరోజు!!

కుటుంబం మావికొమ్మ..కొత్త చిగురు తొడిగి
అనుబంధం అలంకరణ తోరణాలతో
అభిమానం వెల్లివిరిసి, ఆత్మీయంగా
అల్లుకొని పోవడమే..పెళ్ళిరోజు!!

కొత్త కోరికల వయసు కూరిమితో
అందిస్తుంటే
ప్రేమనిధిలాంటిది పెళ్ళిరోజు
ప్రతివత్సరం.. ఒక నూతన పేజీని తెరుస్తుంది!
ఆశీస్సుల చిరుజల్లులనందిస్తుంది!
శుభాభినందల సంతోషాన్ని తెస్తుంది!!

– డా॥ కర్నాటి లింగయ్య
9515298610

వన భోజనాలు

ఊరూ,వాడా ఏకమై
అమలక వనాన్ని అల్లుకునే
అందమైన వేడుక....

ధాత్రీ గొడుగున అరటి ఆకుల్లో
ఆనందాన్ని పంచు వడ్డనలు
ఆత్మీయతల ఒడిలో
అందరూ ఒక్కటిగా ఐక్యంగా సాగే
వనభోజనం జనరంజకం....

సాలగ్రామ పూజలు, నివేదనలతో
ఆమ్లవనం ఆధ్యాత్మిక వనంగా మారి
వత్తిళ్లు, వేదనలకు
పలాయన మంత్రం పలుకుతుంది....

మన సాంప్రదాయంలో ఇమిడిన ఆచారాలు
ఆరోగ్య సూత్రాలై మనల్ని
నిరోగులుగా దీవించు తారకమంత్రాలు
గుర్తెరిగి ఆచరిస్తే అంతా
కరతలామలకమే....

మన ఆచార, సాంప్రదాయాలు
ఏ ఉగ్గగిన్నెలు,ఉద్ధరిణలు ఎరగని
ప్రాణవాయువులు....

–సోంపాక సీత
8639311050

చిత్రమైన అద్దం

అదొక అద్భుతాల అద్దం
బాహ్య సౌందర్యంతో పాటూ
అంతరంగ సొబగులు కూడా చూపుతోంది..!!

నువ్వు నవ్వితే నవ్వే అద్దం కాదది

అలాగని నిన్ను చూపలేనిదీ కాదు
నిన్ను నిన్నుగానే చూపుతోంది
నిన్ను అచ్చంగా నీలానే చూపుతోంది...!!

ఇంట్లో నువ్వు తలదువ్వే
నిలువుటద్దం కాదది
నువ్వు పౌడర్ పూయగానే
తెల్లగా మెరుపులు కనపడ్డానికి
అక్కడ నీ అసలు రంగు మాత్రమే కనబడుతుంది
అక్కడ నీ నిజస్వరూపం మాత్రమే దర్శనమిస్తోంది..!!

పట్టు వస్త్రాలు ధరించినంత మాత్రాన
నీ అందచందాలేం మారిపోవక్కడ
ఆభరణాలతో నువ్వు కనిపించినంత మాత్రాన
నీ ముఖారవిందమేం అద్భుతమైపోదు
నువ్వు నువ్వులానే కనిపించే అద్దమది
అంగట్లో దొరికే అద్దం కాదిది
అంతరంగానికి మాత్రమే చిక్కే నీ మనసద్దమిది..!!

కవిచక్ర 'సింహా'
7702280542

అమ్మ

మాతృత్వపు ప్రేమకు
వయసెప్పటికీ అడ్డుకాదు
సృష్టికి మూలమైన
స్త్రీ కదా
అమ్మతనానికి
అసలైన చిరునామా
రక్తం పంచుకుపుట్టిన
ఆ కవల పిల్లలను చూస్తున్న
ఆ అమ్మ కళ్ళలోని
ఆనందం
ఎంతని చెప్పగలం
అల్లారు ముద్దుగా ఆడుతున్న
ఆ పసిబిడ్డల వైపే చూస్తోంది
ఎందుకంటే ఆమె అమ్మ కదా..!!

(74 సంవత్సరాల వయసులో జన్మనిచ్చిన ఓ అమ్మను చూసి)

–యు. లక్ష్మీ నరసింహా గౌడ్
7702280542

కవిత

అణచేసిన ఆవేశం కాదు
పెల్లుబికే ఆలోచన కవిత
అణగారిన బతుకు హోష కాదు
వెల్లి విరిసే చైతన్య జీవం కవిత
అగాధంలో జారిన మౌన రోదన కాదు
అనంత జలనిధి ప్రచండ హోరే కవిత

చేజారిన ఫలితం కాదు
చేజిక్కిన విజయం కవిత
ముంచేసే విషాద ప్రశాంతత కాదు
మేల్కొలిపే రంజిత మంజరి కవిత
జవజచ్చిన భాషకు భావం కాదు
క్షయమవ్వని భావావేశం కవిత

– డా॥ మానస్ కృష్ణకాంత్
949192 8384

పుస్తకం జ్ఞాన ప్రదాయిని...!

పుస్తకాలనుపఠియించు
మస్తకాలనది వెల్గించు
నిత్య గ్రంథాధ్యయనం
నిర్మల జ్ఞానముదయించు..!

పుస్తకం జ్ఞాన ఉషస్సు
తొలిగించును తమస్సు
సదా పుస్తక పఠనమే
పెంచువ్యక్తిత్వయశస్సు..!

పుస్తకం కల్పతరువు
జ్ఞానపథ గేయదరువు
అరవైనాల్గుకళలకిల
నెలవగువిజ్ఞానమేరువు..!

పుస్తకం జ్ఞానభాండం
మస్తిష్క జీవకాండం
సామాజిక జాఢ్యాలను
దునుమాడె కోదండం..!

చదివినెంత తరగని నిధి
వికసించులెపఠితులమది
చీకట్లో వెల్గె దీపం..
చైతన్యమేచదువరిహృది..!

పుస్తకాలపఠనీయం
మస్తకమెమేధోమయం
ఎల్లలెరుగని జ్ఞానమే..
మెల్లగ మావశమయం..!

–డాక్టర్ గన్నోజుశ్రీనివాసాచారి
9490145913





అన్వేషణ

కలతలు లేని కన్నీళ్లులేని చీకట్లు లేని
లోకం కావాలి నాకు
మంచి గాలి, మంచి గంధం, మంచి నీళ్లు
మంచి మాటవున్న లోకం కావాలి నాకు
మోసం, ద్వేషం, కుట్ర, కుతంత్రం
హింస, రక్త ప్రవాహంలేని
లోకం కావాలి నాకు
భయంలేని బ్రతుకు నాశిస్తున్నాను నేను
చింతలేని నిశ్చింత రాత్రులు కావాలి
వంచన, కపటం, కాఠిన్యంలేని
రాళ్లు ముళ్ళులేని మనుషులు కావాలి నాకు
అభివృద్ధి పేరుతో మనసును అమవాస్యజేసి
రాజకీయం అక్కర్లేదు
రాబందుల రెక్కల చప్పుడు అక్కర్లేదు
చందమామ మీద అడుగులు నాకక్కర్లేదు
కడుపునిండా తిండిచాలు
నానేల నాకు చాలు
వంచనాపూరిత సంక్షేమ పథకాలు
మాటల గారడీ రాజకీయాలు
ఓట్లవేట అభివృద్ధి ఆటలో అవినీతి
నాటకపోయిన విషం నాకక్కర్లేదు
నా నేల నాకు చాలు
నా అడవి నాకు చాలు
నా గంగ నాకు చాలు
ఆర్భాటలద్దు ఆకలిచావులద్దు.

-సి.హెచ్. మధు
9949486122

ఊరుముద్దు యురేనియం వద్దు

ముద్దు ముద్దు నా ఊరు
వద్దు వద్దు యురేనియం
చల్ల చల్లని నల్లమలను
వల్లకాడు చేయొద్దు
చెంచుకోయ నివాసాలు
ఆదిమజాతికి ఆనవాలు
వేప, తుమ్మ, మర్రి, చింత, టేకు
మానవమనుగడకు శ్వాసవయాలు
పసిడి పంటలు పండి నల్లరేగడులు
అడవిలో మమేకమైన జనవాసాలు
పులులు, చిరుతలు, కోతులు, రొన్నెంగలు
చెంగు చెంగున దుమికె లేళ్ళు
అడవి మృగాలకు ఆత్మరక్షణ స్థావరాలు
పశు పక్షాదులకు నివాసాలు
గలగలపారే సెలయేరులు
కలకలలాడె తటాకములు
ఆయురారోగ్యాలు ప్రసాదించె
ఔషధ మొక్కల నిలయాలు
ఘనమైన అడవులను రక్షించుకుందాం
అభయారణ్యానికి అభయ హస్తం అందజేద్దాం
వికృత చేష్టలు మానుకుందాం
ప్రకృతి సంపద కాపాడుకుందాం
ఆపుదాం యురేనియం
నిలుపుదాం నల్లమల నిండుగౌరవం!



- ఎం.ఏ. గఫార్
9490324834

బతుకో జగన్నాటకం

చీకటివెలుగుల జగన్నాటకంలో
అమావాస్య కుమ్మరించిన చీకట్లోంచి
పిండారబోసిన పౌర్ణమి వెండివెలుగులోకి
పయనమే ప్రమోదం, భగవద్గీత సారం !

చీకటివెలుగుల ఆధిపత్యపోరులో
దీపం కొండెక్కుతే గాఢాంధకారం
చీకటి తోకముడుస్తే ప్రకాశం ఖాయం
అజ్ఞాన పొర తొలగితేనే సుజ్ఞానం జననం !

రెండు తీరాల మధ్య నది నడకలు
రెండు ఉషోదయాల మధ్య చిక్కటి చీకటి
గెలుపోటముల మధ్య సన్నని గీత
రెండు జయాల మధ్య అపజయం కామాయే
"మధ్య" మర్మమెరుగుటేగా జీవించే కళ !

బ్రహ్మాస్త్రంతో విజేతలమవుతామా ?
గురిపెట్టే నైపుణ్యం సొంతం కావాలిగా
దేవుడున్నచోటే దెయ్యం తిష్టలు
కారుచీకట్లోనే దేదీప్యమానం జ్యోతులు !

జయమే కావాలనుకోవడం దురాశ
ఓటమి ఖాయమనుకోవడం నిరాశ
ఆశనిరాశల సయ్యాటల సమరంలో
అపజయం స్వల్ప విరామమని తెలుసుకో !

భూగోళం సగమెపుడూ చీకటే
పగలైతే గవాక్షం తెరుస్తాం
రాత్రికి అగ్గిపుల్ల గాలిస్తాం
గవాక్షం, అగ్గిపుల్లలే విజేతల ఆయుధాలు !

కాంతికే కాంతి మేథో మెరుపు
గదిలో దీపం వెలగాలంటే
మదిలో జ్ఞానజ్యోతి ప్రకాశించి
లోకమంతా కోటి ప్రభలు వెలువాలె !

అపజయంలో జయం, అజ్ఞానంలో జ్ఞానం
జననంలో జనం, మరణంలో రణం
జీవనం వనంలా సంబరంగా సాగాలంటె
జనం మెచ్చే జ్ఞానప్రాప్తికి రణం తప్పదు కదా!

నా పేరు నేను మరిచినా ఫర్వాలేదు
సమాజమదిలో తిష్ఠ వేసే సాఫల్యతే సరి
జ్ఞానసమపార్జనకు ప్రథమ సోపానం..
అజ్ఞానులమని తలచి ఆరంభించుటేగా !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

సకల కళావిభూషణ ప్రతిభకి మచ్చుతునక "వివిధ"!!

కంద పద్యాలూ రచించడం లో నేర్పరి తనం కలిగి దాదాపు నాలుగు కంద పద్య శతకాలు రచించిన పద్య, గద్య కవి నరసిం గరావు గారి కళా, సాహిత్య సమాలోచనలు కి అక్షర రూపమే "వివిధ". ఆధునిక తెలంగాణ చాటువులు, కవి నరసింగా, సింగయ శతకం, కంద మందారం మొదలుగు రచించిన నరసింగ రావు కైవటంలో చాలా వరకు హాస్య రసానికి ప్రాధాన్యం ఉంటుంది. అలాగే సమాజంలో బాధ్యతాయుత పౌరుడుగా మూడనమ్మకాలపై తన కలాన్ని ఎక్కుపెట్టారు. కవిత్వాన్ని పలవరించినా, గద్యాన్ని హృదయానికి ఆకట్టుకునేలా రచించిన, పద్యాన్ని అందంగా నడిపించినా అది రావుగారికే చెల్లింది. **"పద్యం చదువుతుంటే మద్యం తాగినంత మత్తు రావాలి, గద్యం గజగామిని ఉండాలి!"** అంటూ పద్యం , గద్యం ఎలా ఉండాలో చెప్తూ పూర్వ కవులని కూడా స్మరించాలి కవిత్వం రాస్తే నే సరిపోదు. సత్కవులని గౌరవయించినప్పుడు దానికి పరమార్థం అంటారు. ఆట లో ఓటమి గెలుపు సహజమే,, కానీ జీవితంతో ఆట ఆడే ఉగ్రవాదికి హెచ్చరికగా మృత కల్పుడా ! లో చక్కగా చెప్పారు. **"ఆటను ఆట గాళ్లను చూచి ఆనందించలేని వాడ /నువ్వు ప్రపంచంలోని ఆటలా , ఆటగాళ్ల ప్రేమికుల ద్రుష్టిలో మృత కల్పుడవే!"** అని నిరసన ప్రకటిస్తారు.

ఇక శ్రీ శ్రీ గారి గురించిన రాసిన వ్యాసాలు చాలా ఆలోచించతగినవి శ్రామిక జన చైతన్యానికి శ్రీ శ్రీ ఎలా జయభేరి మోగి ంచాడో వీరి వ్యాసంలో సవివరంగా వివరించారు. **"నేనెన్నోక్కణ్నే ధాత్రినిందా నిండిపోయి ..లోకమంతా జల్లులాడే ఆ మాహుర్ధగమిస్తాయి."** అంటూ శ్రమ జీవులతో లోకం అంత నిండి పోవాలని ఆశిస్తారు.ఇక మహాప్రస్థానంలో బహుజనాధికారాన్ని ఎలా ఆవిష్కరించారో చక్కగా వివరించారు. ఆరు దశాబ్దాల కిందనే అధిక సంఖ్యలో ఉన్న బహుజనులకె అధికారం దక్కాలని కోరుకున్నాడు. శ్రీ శ్రీవి కవాతులు కాదని అవి పద్యాలని అన్నప్పుడు చాలా విమర్శలు ఎదుర్కొన్న కూడా అవి ఎలా పద్యాలో సోదాహరణంగా వివరించారు. ఛందోబద్ధం కానీదే మహత్తర పద్యమని నిరూపించారు దానికి **"మరో ప్రపంచం మరో ప్రపంచం /మరో ప్రపంచం పిలిచింది /పదండి ముందుకు/ పదండి తోసుకు/పోదాం పోదాం పైపైకి"** అనే దాన్ని తీసుకొని వివరించారు ...ఈ మొత్తం కవిత లో శ్రీ శ్రీ పిలిచిన పిలుపులో సుఖ సంతోషములతో వుండే ధనిక వర్గాలని కాకుండా పేదవాడి తరుపున మాత్రమే అక్షరాన్ని రచించారు అన్న సత్యాన్ని తెలిపారు. ఇలా శ్రీ శ్రీ రచించిన చాలా కవితల్ని దాని వెనుక

గల కారణాల్ని విశ్లేషించి చక్కగా అందరికి అర్థం అయ్యేలా వ్యాసానికి అందం తెచ్చారు.

ఇక రావు రాసిన పాటలు అన్ని కూడా పల్లె చుట్టూ తిరుగుతూ వారి జీవన చిత్రాన్ని పట్టి ఇచ్చేదే. "పల్లెపడుచు పాట"లో తన మామతో ఇలా అంటుంది

"మోటోళ్ళమంటా మావా మనకు
మాట్లాడ రాదంటా మావ
ఫ్యాషన్‌లు రావంటా మావ
మన బతుకు వ్యర్థమంతా మావ" అని పల్లె పడుచులో పట్నం వాళ్ళు తమ పట్ల గల చిన్న చూపు ని తలుచుకొని కుమిలిపోతారు. చదువు విలువ తెలిసినవాడు ఎవరు కూడా కొడుకుని బడికి పంపి మంచి ప్రయోజకుడ్ని చెయ్యాలి అనుకుంటారు ...కానీ అది కేవలం ప్రైవేట్ బడిలోనే దొరుకుతుంది అని తండ్రి కాదు సర్కారు బడి లో నే అని కొడుకు వాదన చేసుకుంటారు. కొడుక్కి తండ్రి కి మధ్య జరిగిన సంభాషణని.. "చదువు సంవాదము" ఇందులో కొడుక్కి తండ్రి కి మధ్య గల సంభాషణల్ని చక్కగా వివరించారు.

కొడుకు: సర్కారు సాలెయోకోయి నాయన
సక్కగా చదువుకుంటే నాయన
అందుకు తండ్రి అంటాడు.
సర్కారు స్లెకొడ్డు కొడుకా
వద్దు కొడుకా ముద్దు కొడుకా
సధువు సంకనాకుతుంది ..
ప్రవైటు బడికి పోరా కొడుకా ...!! నిజానికి ఇప్పటి తల్లి తండ్రుల విపరీత ఆలోచనకి నిలువుటద్దం ఈ పాట . మంచిగా చదివేవాడు ఎక్కడ ఉన్నా కూడా రాణిస్తాడు.

భార్య విధేయుడు లో సగటు భార్య విధేయుడు అయినా భర్త ఎలా ఉంటాడో చెప్పారు.

"బయట ఏమో పెద్ద పులిని
ఇంటికొస్తేనేమో పిల్లిని
ఆలుగీచిన గీత దాట
పెద్దమనిషి ని రచ్చ కాడ
ఇంటికొస్తే ఉల్లికాడ "

అని సగటు భార్య విధేయుడి మనోగతాన్ని ఎంతో హాస్యంగా రచించారు .. ఇందులోనే కింద ఓ నాలుగు లైన్లు కూడా ఆలోచిం పచేస్తాయి ..

"కుష్ట వ్యవస్థ
సుష్టుగా లంచం బోంచేసి
ఇంకాపెడితే అవస్థ
చెప్పక తప్పదు
ఇంతకు మించి లేదని కుష్ట వ్యవస్థ" లంచాలు మన దేశాన్ని ఎలా నిర్వీరం చేస్తున్నదో ఈ నాలుగు లైన్లను చూసి చెప్పొచ్చు ...

ఇక పద్యాల విషయములో వీరి కలానికి తిరుగు లేదు అని చెప్పొచ్చు ..సింగయ శతకంలో కంద పద్యాలూ ఎన్నో అలరిస్తాయి . అయితే వీరి అన్ని పద్యాలలో సామాజిక స్పృహ ఉండటం వారి బాధ్యతని తెలియ జేస్తుంది.

"చీటికీ మాటిటికి బందుల ధాటికి
పలు బస్సులన్నీ దగ్ధం
కోట్ల కొలంది నష్టం
దాటను చార్జీల పెంపు తప్పదు సింగా ...." అవును మరి బందుల ప్రభావంలో బస్సులను యెడ పెడా తగలబెడితే ఆ తరువాత చార్జీలు భరించాల్సింది సామాన్య జనమే ..అది ఎరుకలో ఉంచుకోవాలని చక్కగా చెప్పారు.

ఇక లంచం ఎక్కడ చూసినా కలదు ఇందు లేదని సందేహం వలదు ఎందు చూసిన లంచమే ...అందుకే అంటారు ...

"ఇందుగలడందులేదను
సందేహము వలదు జనుడ సత్యమే చెబుతున్
ఎందెందు వెదికి జూచినా
యందందే గలదు లంచంవనివి సింగా ..." సత్యము పలికారు ..ఈ రోజుల్లో లంచం లేనిదే ఏ పని జరగదు ..ప్రతి పనికి లంచం ఇవ్వాలి ప్రభుత్వమైనా, ప్రైవేట్ అయినా సంబంధం లేకుండా లంచం ఇవ్వాల్సిందే..ఇది ఒక మహమ్మారిలా పాకిపోయింది.

ఇక పద్యాల కోవలోనే నీతి చంద్రిక పద్యాలూ పిల్లల్ని పెద్దలని అలరిస్తాయి. ఎన్నో నీతి కథలను పద్యాల రూపంలో చెప్పడం సంతోషం .. అందరికి అర్థం అయ్యే విధంగా రచించి ముందు తరాల వారికీ తరగని సంపదని ఇచ్చారు నరసింగరావు గారు ..

"వివిధ" పుస్తకంలో నరసింగ రావుగారి కళా వైభవము, పద్య, గద్య, వచన , కథానిక, కథ రూపంలో ఉన్న అక్షర మాలికలు....ఇక వివిధ సందర్భాల్లో అనేక సమకాలికులు రావు గారిపై రాసిన వ్యాసాలు, పాటలు, కవితలు వంటివి చివర్లో పొందుపర్చారు. చివరగా కవి నరసింగా నువ్వు తెలంగాణా ముద్దుబిడ్డవి, తెలంగాణా తల్లి వోడిలో పెరిగిన ఆణిముత్యానివి అని మౌనిక రాసిన నాలుగు అక్షరాలు అక్షర సత్యాలు ...పుస్తకం చివరలో కూడా తనపై ఉన్న సామాజిక బాధ్యతని మరవని గొప్ప కవి ..ఇదిగో వేలం పాట లో అమ్ముడు పోయిన బలి పశువు అని ముక్తాయింపు ఇచ్చారు

బలి (సిన) పశువు
కట్నాల సంతలో
వేలం వేయబడ్డ యువకుడు
బలిసిన పశువు
కొన్న యువతీ
బలి పశువు !! ....రావు గారు నిరంతర ప్రజల సమస్యలపై తనకున్న పరిధిలో పరిష్కరించాలని తపన పడ్డారు

(పెంటమరాజు నరసింగరావు ఇటీవలే అనారోగ్యంతో తనువు చాలించారు..)

ప్రతులకు: పెంటమరాజు నరసింగరావు
ఇ.నెం. 16-156,
నాగర్ కర్నూల్-509 209
మహబూబ్‌నగర్ జిల్లా
సెల్: 94404 58132

-పుష్యమీ సాగర్
9010350317

మనోహరమైన "తపతీ సంవరణము"

"ప్రబధ్యతే ఇతి ప్రబంధ:" అని ప్రబంధ శబ్దానికి వ్యుత్పత్తి అంటే ప్రకృష్టమైన బంధం కది అని అర్థం. వస్తువుకీ, రచనా రీతికీ ప్రకృష్టమైన కూర్పుగల రచన అని చెప్పవచ్చు. ప్రాచీన కాలంలో ప్రబంధం అనే శబ్దం సామాన్య వాక్యంగా వాడబడేది. తిక్కన కూడా తన భారతాన్ని "ప్రబంధ మండలి"గా పేర్కొన్నాడు. పురాణ లక్షణాలు గల హరివంశాన ఎర్రన ప్రబంధంగా వ్యవహరించాడు. ప్రబంధ లక్షణాలను సంస్కృతలాక్షణికులు తెలిపిన వాటిని తెలుగు లాక్షణికులు గ్రహించి వివరించారు. ''అర్వాచీనములయిన కావ్య నాటక యుద్యానములన దగును" అని వేటూరి ప్రభాకర శాస్త్రి గారు చక్కగా తెలిపారు. మొత్తం మీద వర్ణనా ప్రాధాన్యం గలది ప్రబంధం అని ఒక్క మాటలో చెప్పవచ్చు. అంటే వాస్తవంలో లేని వాటిని ప్రబంధ కవులు వర్ణిస్తారన్నమాట. ఉదాహరణకు సరోవరంలో హంసలుంటాయని, చకోర పక్షులు వెన్నెలను తాగుతుంటాయని, చాతక పక్షి వాన నీటిని మాత్రమే తాకుతుందని, స్త్రీల స్పర్శ వల్లే పూలు పూస్తాయని ప్రబంధాలలో



వర్ణింబడుతుంది. ప్రస్తుతం ఈ గ్రంథంలో భరత వంశ రాజు సంవరణుడు, సూర్యపుత్రి, తపతిల ప్రణయ పరిణయ గాథ ఈ ప్రబంధ కథ ఇది. మహాభారతంలో 23 పద్య, గద్యాలత నన్నయ్య చెప్పిన కథను కాస్తంత విశాలం చేసి, ప్రబంధీకరించి 500 పద్యాలతో విపులంగా, వర్ణనాత్మకంగా వివరించారు అద్దంకి గంగాధర కవి. గోల్కొండ పాలకుడు ఇబ్రహీం కాలంలో ఆయనకు అంకితమిస్తూ రాయబడిన ఈ 'తపతీ సంవరణము' నిజంగా విశిష్ట గ్రంథం ఇది.

ఈ "తపతీ సంవరణ ప్రబంధ కర్త గంగాధర కవి. తండ్రి వీరయామాత్యుడు. ఇంటిపేరు అద్దంకి. కేదారశ్రీ గురువరుని శిష్యుడు. క్షీరమయ సింధు బందువువంటి భారతమున సుధాధారలవంటి పుణ్యకథలు పెక్కుగలవు. వానిలో తపతీ సంవరణులు వృత్తాంతము లలితయైన పుణ్యకథ. కనుకనే దానిని వివిధ శృంగార మహిమల విస్తరించి ఒక మహాకావ్యంగా మలచమని గంగాధరుని కోరెను, తపతీ సంవరణుల శృంగార గాథకును ఏదో కొంత సంవాదము ఉండినట్లు రాముని మనసున తోచిందేమో భారతమందలి మూల కథను తన కథయందలి విచిత్రాంశములను చేర్చి విస్తరించి, ప్రబంధముగా తయారు చేయమని గంగాధరుని కోరితే గంగాధర కవి రాజు కోరిక మేరకు మూల కథను వివిధ శృంగార మహిమలచే విస్తరించి నవరస భావానుబంధ బంధురముగా ఈ తపతీ సంవరణ ప్రబంధాన్ని తీర్చిదిద్దారు. కాకుంటే మూల కథలో శాంత రసము లేదు. కొందరున్నదనుచున్న కరుణ రసమునకును, ఇందు తావు లేదు. ప్రధాన రసము మూలమైనా శృంగారమే. శ్రీ కృష్ణదేవరాయల కాలంలో ప్రబంధం పరిపూర్ణ లక్షణాలతో విలసిల్లేది. అందుకనే ఆ యుగాన్ని ప్రబంధయుగంగా పేర్కొంటారు. అల్లసాని పెద్దన రచించిన మను చరిత్ర మొదటి ప్రబంధంగా చెప్పుకోవచ్చును. రాను రాను ఈ ప్రబంధాలపై చిన్నచూపు ఏర్పడింది. ఇందుకు కారణం కేవలం అర్థం కాకపోవడమే. పండిత పామరులకు సైతం అర్థం అయ్యేది ఏదయినా కావ్యం అవుతుంది కానీ, ఎంత చదివినా అర్థం కానిది ఎప్పటికీ ఎవరి మన్ననలు పొందలేదు. కానీ దేని ప్రాధాన్యత దానిదే. అన్నీ సాహిత్యంలో చిరకాలం నిలవాల్సిందే..

ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి
ఫోన్: 040-29703142

-శైలజామిత్ర
9290900879

కానిపని

ఇంటో ఈగల మోత
బయటపల్లకీల మోత
మింగమెతుల్లేదు
మీసాలకు సంపెంగనూనె
తన కోసం తవుడులేదు
పక్కింటికి పరమన్నము
ఉట్టె కెగరనివాడు
ఆకాశానికి నిచ్చెనలు
ముందు ఇల్లు చక్కపెట్టు
ఆ తర్వాతే విదేశీవ్యవహారం!

- సయ్యద్ బందె అలీ

పూర్ణ కలశం

యాబది ఆరు అక్షరాల పూర్ణ కలశం తెలుగు
సుధలను కురిపించేది తెలుగు
మధువుని మరిపించే తెలుగు
అష్టావధానం అయితే నేమి
సమస్యాపూరణం అయితేనేమి
సప్తస్వరాలను అవలీలగ కలుపుకునే
గుణ సంపద కలిగిన తెలుగు

అసమాన ఉపమానాలతో దేదీప్యమానమై
వ్యాకరణంతో వాసికెక్కి
కన్నడ ప్రభువు లతో కీర్తింపబడీ
తమిళ కవులు చేత భళాఅని మెప్పొంది
అన్య భాషా పండితులను నివ్వెర పరిచి
అగ్ర పథాన నిలిచింది తెలుగు

అక్షర యాత్రికులకు అండగా నిలిచి
కవి కర్షకులకు సేద్యయోగ్య క్షేత్రమై
నాటి శిలాశాసనంమొదలు నేటి కంప్యూటర్దాక
ఎన్నెన్నో అపురూపకావ్యాలకు పురుడు పోస్తూ
ప్రజ్వరిల్లు తూనే ఉన్నది తెలుగు మేటివెలుగై
పండితుని నుండి పామరుల వరకు
ఎల్ల వేళల అలరిస్తూ

-అరుణ కీర్తిపతాక
9395147443

నా తెలుగు

తెలుగుకన్న వెలుగు పంచు భాషలేదు
తెలుగుకన్న తెగువ పెంచు వాక్కు లేదు
అజంతా సోయగాల అమరభాషరా ఇది
యుగాలెన్ని మారినా ఇగురదుఈ జీవనది
నా మాతృభాష తెలుగు -
నా ఊపిరి హృదయ లయ తెలుగు

ముత్యాల దస్తూరి నాభాషకు ఆభరణం
నుడికారాల కస్తూరి నా భాషకు పరిమళం
పద్యసాహితీ ప్రబంధాను బంధం నాతెలుగు
హృద్యమైన అవధాన సంధానం నా తెలుగు
పొగడగ చెఱకుగడే కటిక చేదు నాభాష ముందు
వివరింపగ మీగడే సాటిరాదు నా భాషే పసందు
నా మాతృభాష తెలుగు-నా ఊపిరి హృదయ లయ తెలుగు

భువన విజయకొలువులో కవనమై చెలఁగింది
దేశభాషలన్నిటిలో దవనమల్లె కీర్తిగొంది
పొల్కుర్కిసోమన్న ప్రభవించిన నా తెలుగు
బమ్మెర పోతన్న ప్రవచించిన నా తెలుగు
జానపదుల గళ గర్జన నా భాష శ్రీకారం
అన్నమయ్య పదకీర్తన నా భాష ఓంకారం
నా మాతృభాష తెలుగు -
నా ఊపిరి హృదయ లయ తెలుగు

-గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

ఆకాంక్ష

కటిక చీకటి నిండిన
కొందరు అభాగ్యుల
బతుకుల్లో ఈ సారైనా
దీపావళి ఆనందమనే
వెలుగును నింపితే బాగుండు

దమురులేని ప్రమిదల్లా
ఏ కళాకాంతులు లేకుండా
ఆరిపోయే ముందు
మినుకు మినుకు మంటు వెలిగే దీపంలా కాకుండా

అన్నివిధాల సంతోషాన్ని
అందించే సుఖమైయమైన
జీవితాన్ని పిల్లా పాపలతో
పది కాలాలా పాటు వారు
చల్లగా ఉండాలనే ఆకాంక్ష
మనందరిలో ఉండాలి

వారనుభవిస్తున్న దారిద్యం
దేవుడిచ్చిన శాపం కాదు

మనుషులు ఏర్పరచిన అసమానతల నడుమ
అన్యాయానికి బలవుతున్న
మస్థితికి తార్కానం
(ఏండ్ల తరబడి అంధకారం నిండిన వారి
జీవితాల్లో ఆశల వెలుగులు తొంగిచూసినప్పుడే
కదా నిజమైన దీపావళీ మనకు వచ్చినట్టు!!)

-జవేరియా
9849931255

వర్షం కురుస్తోంది...

కరవు తీరా వర్షం కురుస్తోంది
వాగులు,వంకలు మురుస్తున్నాయి
చెరువులు, చెలమలు నిండుతున్నాయి
ప్రాజెక్టులన్నీ కళకళలాడుతున్నాయి
నేలతల్లి మహోదరియై విలసిల్లింది
పచ్చని చేలు పులకరించి పలకరిస్తోంది
చెట్లు,చేమలు సమృద్ధిగా పెరుగుతున్నాయి
లతలు,పూలు పుడమిని అలంకరిస్తున్నాయి
గట్లు తెగి నీటి ప్రవాహాలు ఉరకలెత్తుతున్నాయి
పుడమి పులకరించి పరవశిస్తుంది
పశువులు,పక్షులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి
విత్తనాలు నేలతల్లి గర్భం నుండి పైకెదుగుతున్నాయి
అందమైన అరణ్యాలు విస్తరిస్తున్నాయి
చెరువుల్లోని జీవజాలమంతా ఉత్తేజితమవుతున్నాయి
తుమ్మెదలు ఋతురాగాలు పాడుకుంటున్నాయి
పూలపండుగ కోసం విరులవాన కురుస్తోంది
కొత్త కొత్తని వసంతం ఆసాంతం అవుతుంది
చల్ల-చల్లని వాతావరణం కొత్తపెళ్ళి కూతురవుతుంది
సుమూహుర్తాల కోసం సుమబాలలు అమృతం
ఒలికిస్తున్నాయి
భద్రమై,ఆశ్వయుజ అక్షయమై
నవరాత్ర శోభితమై ప్రకృతి ఇంద్రధనుస్సే అవుతుంది
హర్షామోదంతో ముదిమి సైతం
యవ్వనాన్ని సంతరించుకుంటుంది
పునీతమైన నదులు ప్రక్షాళన చేస్తూ
అలల జడులతో ఝరులై
సాగిపోతున్నాయి.

-డా.రామక కృష్ణమూర్తి

భారతీయం

నా దేశం సుందరం సుమధురం
భారతీయనీ విశ్వసుందరనీ

గలగల పారేటి నదుల సంగమం
పాపాలను తొలగించే గంగా ప్రవాహం

సంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లు
ఆచార వ్యవహారాలకు హరివిల్లు

వాగ్గేయ కారుల వచనములు
పద్య కీర్తనలతో పరిఢవిల్లే

రామాయణ భారతములు
మది రంజింప భక్తితో

ఇదే ఇదే భారతం
విశ్వ సుందర భారతం

-కమ్మరి శ్రీనివాస చారి
9177324124

చీకటి రాగం

చిక్కని చీకటి కూడా
కమ్మని రాగాలు పలుకుతుంది
తేనీటి విందులా పిల్లతెమ్మెర
తాళం వేస్తుంటుంది

పరుగులుపెడుతూ నగరం
చీకటితో మోహాన్ని కడుగుతూ
మూటకట్టిన మల్లెల్లాంటి
అనుభూతులను రాత్రి అటకపై దాస్తుంది

దాచేసిన చేదుమాత్రల్లా
విషాదం చీకటిలో కలిసిపోతూ
వెలుతురు గీతాలను కలగంటుంది
ఆతురత నిండిన కన్నుల్లోంచి జారిన
తడిచుక్క ఆసరావెతుక్కుంటుంది

-సి.యస్.రాంబాబు
9490401005

సముద్రం

సముద్రపు పువ్వులు
సముద్రం కెరటాలను
యుద్ధానికి పంపిస్తుంది.

కెరటలేమో తీరపు కంచెపై
తెల్లని నురుగు పువ్వులై ప్రాణాన్ని కోల్పోతాయి...
జీవిత కాలం చిన్నదే
అయితే ఏంటి?
జీవించడం అక్కడి నుండే నేర్చుకున్నాను...

సముద్రాన్ని నా కళ్లతో కొలవడానికి
ప్రయత్నం చేశాను...
చూపులు అలల మడతల్లో
కొట్టుకుపోయాయి...

తీరాన్ని అడుగులతో
లెక్కపెట్టడానికి నడిచాను...
పలకపై అక్షరాలను తుడుచుకునే పిల్లాడిలా
నా పాదముద్రలను సముద్రం తుడిచేసింది...

సంచిలో దాచుకున్న అక్షరాలతో
సముద్రాన్ని కవితలో నింపేశాను?
ఇప్పుడు నా కవిత్వం
సముద్రమంత లోతుగా, విశాలంగా

- అఖిలాశ
7259511956

జీవిత మొగ్గలు

బతుకు ఒక గొప్ప యుద్ధక్షేత్రమైనపుడు
కాలంతో నిత్యం పోరాటం చెయ్యకతప్పదు
జీవితం నిత్యపోరాటాల అనంతసాగరం

బతుకు ఒక కల్లోల కడలిని తలపించినపుడు
కష్టసుఖాల తీరాన్ని నిత్యం ఈదక తప్పదు
జీవితం అలజడుల సాగరసంగమం

బతుకు ఒక పూలతోటలా వికసించినపుడు
ప్రతిక్షణం ఆనందానుభూతిని పొందక తప్పదు
జీవితం పరిమళించే పరిమళాల ఊట

బతుకు ఒక నదిలా ప్రవాహమై సాగినపుడు
నిరంతరం రాళ్ళూరప్పలు తగలక తప్పదు
జీవితం గాయాలను మోసే దుఃఖసముద్రం

బతుకు ఒక సంగీతమై రాగాలను పలికినపుడు
సరిగమల గానామృతాలను
ఆనందించక తప్పదు
జీవితం సప్తస్వరాల
స్వరరాగ గంగాప్రవాహం

-డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

ఫలించే కల!

ఒక అన్నం ముద్ద వైపు
వేల జతల కళ్ళు
ఆశగా చూస్తుంటాయి
మురికివాడలన్నీ
మూకుమ్మడిగా
సాధించిన అభివృద్ధిని
ప్రశ్నిస్తుంటాయి
భావిపౌరుల దేహాల మీద
చిరిగిన గుడ్డముక్కల్ని చూసి
జాతీయ జెండా సిగ్గుతో
తలదించుకుంటుంది
ఒక రాకెట్
అంతరిక్షం అంచుల్ని
తాకిన ప్రతిసారీ
ప్రతిపక్షానికి పేదరికం
గుర్తొస్తుంది
కోట్లాది మందికింకా
కూడూ గూడూ గుడ్డా
అందని ద్రాక్షేనంటే
గుండె తరుక్కుపోతుంది
దేశం వెలిగిపోతోందని
అంతర్జాతీయ వేదికల మీద
ఎంతలా గొంతు చించుకున్నా
కాలే కోట్లాది కడుపుల కింత
అన్నం దొరకని కఠోర సత్యం
అభివృద్ధి సూచికను వెక్కిరిస్తుంది
ప్రలోభాలతో పబ్బం గడుపుకోకుండా
ప్రభుత్వాలు చిత్తశుద్ధితో
ముందడుగేస్తుంటే
పేదరిక నిర్మూలన ఫలించే కలే!
(అంతర్జాతీయ
పేదరిక నిర్మూలన దినం సందర్భంగా)

- సాంబమూర్తి లండ
9642732008

చందమామ

పసివయసు లో వేసవికాలపు పున్నమి రాత్రుల్లో
చీకట్లను చీల్చుతూ తెల్లగా నింగిలో మిలమిల మెరిసే
చిత్తరువును చూస్తూ ఆరుబయట పట్టెమంచంలో
హాయిగా ఒరిగి అదేమిటని అమ్మమ్మ ను అడిగితే
కాలాలు మారినా చరితలు చెరిగినా తాను మారని
మనందరి మామ చందమామ అని తెలుసుకొన్న రోజులింకా గురుతే
లక్షలసార్లు తనతో చూపులముచ్చట్లాడి
నాసంతోషాలను బాధలను పంచుకుంటూనే వుంట ఇప్పటికీ
కనులు మూసి కలల ప్రపంచంలో తేలుతున్నప్పుడు
ఒక్కోసారి పీడకలల కుదుపుకు దిగ్గన లేచి కలత చెందినప్పుడు
నాకు ఓదార్పు నిస్తూ తీపి చేదు కలల రూపమే కనుల కొలను అంటూ
ధైర్యం చెబుతూ నా మానసమున కలువలు పూయిస్తూ
తన వెన్నెల లోకంలో విహరింప జేయిస్తాడు ఆ చందమామ
అందుకే నా జీవనసంద్రంలోని సంతోషాల అలలను
కలతల సుడిగుండాలను తనతో పంచుకుంటూనే వుంటా
ఎందుకంటె నేను పోయినా ఎప్పుడూ తాను నీలాలనింగిలో
వెండిజాబిలై వెలుగుతూనే వుంటాడు
నా జ్ఞాపకాలను తన వెన్నెలపిండి లో కలుపుకొని

-వకుళ వాసు

త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగిన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం







సాహితీ సప్తాహంలో కొకలలూరి ఇనాక్ రాసిన 8 పుస్తకాల ఆవిష్కరణ

స్వయంకృషితో ఎదిగిన సాహితీవేత్త కొలకలూరి ఇనాక్..

కొలకలూరి ఇనాక్... తెలుగు సాహిత్యంలో మకుటాయమానమైన పేరు. తెలుగు రచయిత, సాహితీకారుడు, కవి. అతను తెలుగు పదాలకు వెలుగులద్దిన పదనిర్దేశి. ఆధునిక సాహిత్య ప్రక్రియలో అన్ని రుచులనూ చవిచూచిన నేర్పరి. వేల మందికి విద్యాదానం చేసిన ఉపకులపతి. ఈయన చేసిన కృషికి తగ్గ ఫలితంగా 2014 లో భారత ప్రభుత్వం, జాతీయస్థాయిలో మహావ్యక్తులకు, మార్గదర్శకులకూ ఇచ్చే **"పద్మశ్రీ"** పురస్కారం ప్రకటించి గౌరవించింది. 2015లో భారతీయ జ్ఞానపీఠ్ సంస్థ వారు ఇచ్చే మూర్తిదేవి పురస్కారం ఇతని **"అనంత జీవనం"** అనే రచనకు లభించింది.

ఈయన వేజెండ్ల గ్రామంలో నిరుపేద కుటుంబీకులైన రామయ్య, విశ్రాంతమ్మ దంపతుల సంతానంగా, 1939, జూలై 1 న జన్మించారు. గుంటూరు, చిత్తూరు, కడప, అనంతపురం, తిరుపతి వంటి ప్రదేశాలలో తెలుగు ఆచార్యుడుగా పనిచేసి, అంచెలంచెలుగా ఎదుగుతూ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవి అందుకున్నారు. మరోవైపు తెలుగు సాహితీ ప్రక్రియలో, తనదైన శైలికి వన్నెలద్దుతూ, తన కలం బలం చాటారు. 1954లో లోకంపోకడ, ఉత్తరం అనే కథానికలతో తెలుగు సాహితీ లోకంలో చేరినారు. 1958లో **"దృష్టి"** అను నాటికను ప్రాసి, కేంద్రప్రభుత్వ బహుమతిని అందుకున్నారు. 1965లో "జైహింద్" అను నాటికకు రాష్ట్రప్రభుత్వ బహుమతిని దక్కించుకున్నారు. 1986లో ప్రాసిన **"ఊరబావి"** కథాసంపుటి, రచయితగా ఆయన స్థానాన్ని చాటిచెప్పినది. 1988లో **"మునివాహనుడు"** కథాసంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈ రకంగా రెండు సార్లు ఈ పురస్కారాన్ని అందుకున్న అరుదైన రచయితగా ప్రసిద్ధిచెందినారు. నవలా రచయితగా, నాటక స్రష్టగా, విమర్శకునిగా తెలుగు సాహితీ లోకానికి సుపరిచితుడైన ఈయన, పర్యవేక్షకునిగా 20 మంది శిష్యులకు పి.హెచ్.డి. పరిశోధనలో మార్గదర్శకులైనారు. పొన్నూరులో, 2014, జనవరి-5న అజో-విభో-కందాళం ఫౌండేషను వారు నిర్వహించిన జాతీయ నాటికల పోటీలలో వేదికపై లక్ష నగదుతో ఈయనను సత్కరించారు. 2014, జనవరి-18న గుంటూరులో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషను వారు 2 లక్షల నగదు పురస్కారం అందజేశారు. 2011లో గుర్రం జాషువా సాహిత్య పురస్కారం అందుకున్నారు. దుగ్గిరాలకు చెందిన జాషువా కళాపరిషత్తు వారు, వెండి కిరీటం బహుకరించారు.

ఇటువంటి సాహితీ స్రష్ట కు జరిగిన సాహితీ సప్తాహం శ్రీత్యాగరాయ గానసభలో కన్నుల పండువుగా జరిగింది. శుక్రవారం **మొదటి రోజు**లో భాగంగా సాహిత్య అకాడమి అధ్యక్షుడు **డా॥ నందిని సిధారెడ్డి** గారు **'రంధి'** నవలను ఆవిష్కరిస్తూ మాట్లాడారు. హృదయం లేని శాసనాలకు సంఖ్యాబలం ఉంటుందే కానీ ఆచరణకు వచ్చేటప్పటికి హృదయం ఉండదని **"రంధి"** నవలలోని ఇతివృత్తమని తెలిపారు. మానవతే **'రంధి'** నవలకు ఆత్మ అని, అంటరానితనం వద్దని, ప్రభుత్వాలు శాసనాలు చేసినా ఒడవని రంధిగా ఇది మిగిలిపోయిందని పేర్కొన్నారు. మానవత లోక్‌సభలో హృదయాలున్నవారు చేసే మానవతా శాసనాలే సమాజాన్ని మారుస్తాయని ఈ నవల సందేశమని సిధారెడ్డి గారు తెలిపారు. సాహితీ విమర్శకుడు **ప్రభాకర్ జైని** మాట్లాడుతూ మాదిగలను నెత్తికెత్తుకున్న నవల **'రంధి'** అని అన్నారు. మాదిగ పల్లెక, అగ్రకులాల గ్రామాలకు మధ్య ఉండే ఘర్షణనే **'రంధి** నవలగా రచయిత రచించారని తెలిపారు. గ్రామాల్లో అగ్రవర్ణాలు, అట్టడుగు వర్గాలపై చేస్తున్న అకృత్యాలను రచయిత ఎండగట్టారని పేర్కొన్నారు. ఈ సభలో త్యాగరాయగానసభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి ప్రముఖ కవి **బిక్కి కృష్ణ, డా॥తెన్నేటి సుధాదేవి** పాల్గొన్నారు.

రెండవరోజు శనివారం బిసీ కమీషన్ ఛైర్మన్ **బిఎస్ రాములు "గుడి"** కథా సంపుటిని ఆవిష్కరించారు. స్వయంకృషి, ప్రతిభతో అంచెలంచెలుగా వీసి దాకా ఎదగడం స్ఫూర్తిదాయకమని బిఎస్ రాములు గారు కొనియాడారు. ఈ కథా సంపుటిలో రాములమ్మ, యావ, దీపావళి, పేరుబలం, పెద్దమ్మగుడి, ప్రాచీనపాపం, సిలారు సాయలు వంటి తొమ్మిది కథల్లో చక్కని కుటుంబ వాతా వరణం కనిపిస్తుందని, మనసును తరచిచూసే ఆర్ద్రత ఉందని తెలిపారు. కథల్లో పాత్రలు వాస్తవానికి ఎంతో దగ్గ రలో ఉన్నాయని పేర్కొన్నారు. మాతృమూర్తి విశ్రాంతమ్మకు ఈ గ్రంథం అంకితం ఇవ్వడం ఎంతో హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో **కొలకలూరి అనిత, రఘుశ్రీ, గిడుగు కాంతికృష్ణ, బిక్కి కృష్ణ,** త్యాగరాయగానసభ అధ్యక్షులు **కళా జనార్ధన మూర్తి** పాల్గొన్నారు.

మూడవరోజు ఆదివారం రోజున పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ గారు రచించిన 100వ గ్రంథం **'పాలి'** కథా సంపుటిని విశ్రాంత న్యాయమూర్తి **జస్టిస్ నాగమారుతి శర్మ** ఆవిష్కరించారు. ఆవిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ దళితుల్లో మహిళలకు అత్యున్నత గౌరవం ఉంటుందనే సత్యాన్ని ఇనాక్ ఈ రచనల్లో తెలిపారని తెలియజేసారు. ఈ కథా సంపుటిలో మొత్తం 19 కథలున్నాయని, ఇనాక్ పై అతని తల్లి ప్రభావం ఎక్కువగా ఉందని, ఆమె స్ఫూర్తితోనే వీరు ఎదిగారని పేర్కొన్నారు. కేవలం పద్యాలే రాయడమే కాకుండా కథలు అనేకం రచించారని తెలిపారు. యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశం దుర్భరంగా మారి ఎంత ఇబ్బందులు ఎదుర్కున్నారో.. కానీ అదే యూని వర్సిటీలో వీసీ కావడం ఇనాక్ గొప్పదనమని, వారి పట్టుద లకు నిదర్శనమని కొనియాడారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ సమాజాన్ని మార్చగలిగే శక్తి రచయితలకే ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో **కొలకలూరి శ్రీకిరణ్, రమణ వెలమకన్ని, పెద్దూరి వెంకటదాసు, రఘుశ్రీ,** గానసభ అధ్యక్షులు **కళా జనార్ధన మూర్తి** పాల్గొన్నారు

నాలుగవ రోజు సోమవారం సభలో కొలకలూరి ఇనాక్ గారు రచించిన **మిత్రసమాసం(వ్యాకరణ పరిశోధన), అంబేద్కర్ జీవితం** అనే గ్రంథాలను తెలంగాణ గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు **డాక్టర్ అయాచితం శ్రీధర్** ఆవిష్కరించి, తెలుగు జాతికి వరం, అక్షరస్వరం ఇనాక్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత కవి **డాక్టర్ ఓలేటి పార్వతీశం, శంకరం వేదిక అధ్యక్షులు యలవర్తి రాజేంద్ర ప్రసాద్, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య వెల్దండ నిత్యానంద రావు(ఓయూ), డా॥సి,** లలితావాణి, కళా జనార్ధనమూర్తి తదితరులు పాల్గొనడం విశేషం.

కొలకలూరి సాహితీ సప్తాహం కార్యక్రమంలో **ఐదవరోజు** మంగళవారం జరిగిన సభలో ఇనాక్ గారి రచన **"మనూళ్ళలో మాకథలు"** అనే కథాసంపుటిని నేటినిజం సంపాదకులు బైసదేవదాసుగారు ఆవిష్కరించాం. ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతూ ఇనాక్ గారికి జ్ఞానదాహం ఉందని, అదే వీరి జీవితాన్ని గొప్పగా ముందుకు నడిపిస్తోందని తెలిపారు. వీరి కథలు రాబోయే తరాలకు మార్గనిర్దేశం చేసాయని అన్నారు. ఆ గ్రంథంలోని కథల్ని ప్రస్తావిస్తూ కొన్ని అద్భుతమైన వాక్యాలను వినిపించారు. ఎంతో కష్టనష్టాలకు ఓర్చి ఈ రోజు ఈ స్థాయిలో ఉన్న వీరి జీవితం ఎందరికో మార్గదర్శకం అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హాస్యబ్రహ్మ శంకరనారాయణ గారు మాట్లాడుతు గురునానక్ జయంతి ఈ రోజు కావడంతో గురునానక్‌లో ఇనాక్ గుర్తుకు వచ్చారని, గుర్రం జాషువా, అంబేద్కర్ తరువాత మనకు కొలకలూరి ఇనాక్ గారే ఉన్నారని కొనియాడారు. సభాధ్యక్షులుగా పాల్గొన్న గానసభ అధ్యక్షులు **కళా జనార్ధనమూర్తి** గారు మాట్లాడుతూ ఇంతటి మహానుభావులు, సాహితీవేత్తల సభలు జరగడం ఎంతో గర్వకారణమని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఘన సన్మానాలు ఈ వేదికమీదే తాము చేస్తామని హామీ ఇచ్చారు. సమీక్షకులుగా పాల్గొన్న **జల్ది విద్యాధరరావు** మాట్లాడుతూ వీరి కథలన్నీ వారి జీవితాలనుండే వచ్చా యని, అంటరానివారని ఎంత హేళనకు గురి అయినా వారు ఆకలితో అలమటించారే కానీ తమ ఆత్మవిశ్వాసాన్ని మాత్రం వీడిపోలేదని అభినందించారు. మరో సమీక్షకురాలు **శైలజామిత్ర** మాట్లాడుతూ "ఎన్ని ఆస్తులున్నా, ఎంత ధనమున్నా, ఎంత పలుకుబడి ఉన్నా సరే అమ్మ ఉందనే ధైర్యానికి సరితూగవని, మనిషి జీవితంలో మొదటి అడుగైన తల్లి ఎంతో ప్రోత్సాహం ఇవ్వడంతో ఈరోజు ఈ స్థాయికి వీరు ఎదిగారని, కథలన్నీ అమ్మ చుట్టూ తిరగాయని, ఈ కథలు రాయలసీమ యాసతో మరింత ద్విగుణీకృతం అయ్యాయని తెలిపారు. ప్రముఖ కవి **రఘువీర ప్రతాప్‌గారు, గిడుగు కాంతికృష్ణ** తమ మన:పూర్వక అభినందనలు తెలిపారు. చివరిగా స్పందన గా **ఇనాక్** గారు మాట్లాడుతూ తల్లిని మించిన దైవం లేదని తెలిపేందుకు తమ జీవితంలో కొన్ని సంఘటనలను తెలియజేసారు. తనకు అమ్మ తప్ప మరే ప్రపంచం లేదని తెలిపారు. అంచెలంచెలుగా తన ఎదుగుదలకు దోహద పడుతూ ఈ రోజు ఇక్కడ ఈ స్థాయిలో ఉన్నానంటే నన్ను వెంటాడే తల్లి మాటలే అని చెబుతూ ఆనంద బాష్పాలు రాల్చారు. ఈ సభలో ప్రముఖ కవి **బిక్కికృష్ణ** తదితరులు పాల్గొన్నారు.

ఆరవ రోజు బుధవారం జరిగిన సప్తాహంలో కొలకలూరి ఇనాక్ గారు రచించిన కవితా సంపుటి **"విశాల శూన్యం"** తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు ఆవిష్కరించి మాట్లాడుతూ పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ తెలుగు సాహిత్యంలో ఓ సాహితీ శిఖరం అని కొనియాడారు. వీరి రచనల్లో వాస్తవికత, దార్శనికత కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా సాహితీ ప్రముఖులు బిక్కి కృష్ణ, లక్కరాజు నిర్మల, విద్యాధర్‌రావు, క్రాంతి కృష్ణ పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు డా॥ఎంకె రాము, కోడి కోటేశ్వరరావు లతో పాటు త్యాగరాయ గానసభ అధ్యక్షులు శ్రీ కళా జనార్ధనమూర్తి గారు పాల్గొన్నారు.

ముగింపు సభగా గురువారం జరిగిన సాహితీ సప్తాహంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ రచించిన కథల సంపుటి **"చలనసూత్రం"** హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ **బండారు దత్తాత్రేయ** గారు ప్రశంసించారు. ఆచార్య ఇనాక్ గారు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, వీరి రచనలు ఎందరికో మార్గదర్శకమని కొనియాడారు. ఆవిష్కృత కృతిని స్వీకరించిన కళాపోషకులు డా॥ విజయకుమార్ గారికి, గానసభ అధ్యక్షులు కళాజనార్ధనమూర్తి గారికి అందించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న బీసి కమీషన్ సభ్యుడు**"డా॥ వకులాభరణం కృష్ణమోహన్‌రావు** గారు మాట్లాడుతూ ఇనాక్ ఆధునిక సాహిత్య విప్లవకారుడిగా అభివర్ణించారు. ప్రముఖ కథా రచయిత **విహారి** పుస్తక సమీక్ష చేసారు. అతిథులుగా కార్పొరేటర్ **ముఠా పద్మానరేష్, గాయని తోట లక్ష్మి** హాజరయ్యారు. గాన సభ అధ్యక్షులు కళాజనార్ధనమూర్తి గారు అధ్యక్షులుగా వ్యవహరించారు.

మనిషి జన్మించేది ఒకసారే. మరోసారి కూడా జన్మి స్తారు అనేది కేవలం మన ఊహే. కనుక ఉన్న జీవితానికి సార్థకత ఏర్పరుచుకోవాలని పెద్దలు అంటుంటారు. అలాగని అందరూ బ్రహ్మాండాలు సృష్టించలేరు. సృష్టించినా వెలు గులోకి రాలేరు. కనుక మనిషిగా పుట్టినందుకు మనం చేసే పనివల్ల మనల్ని నమ్ముకున్నవారు బాధపడకుంటే చాలు. చరిత్రలో నిలబడాలంటే ఎవరికీ సాగిలపడక్కర్లేదు. సామరస్యంగా మెలిగితే చాలు. మన బాధ్యత మనం సక్ర మంగా చేయగలిగితే అదే పదివేలు అనేదే కొలకలూరి ఇనాక్‌గారి ఉద్దేశ్యం. వీరి ఆశయాలు నిలవాలని, వీరి ఉనికి తెలుగు సాహిత్యంలో ఒక పేజీగా నిలిచిపోవాలని కోరుకుందాం..!

మొదటి రోజు 'రంధీ' నవల ఆవిష్కరణ

రెండవ రోజు 'గుడి' కథా సంపుటి ఆవిష్కరణ

మూడవ రోజు పాలి' కథా సంపుటి ఆవిష్కరణ

నాల్గవ రోజు 'మిత్ర సమాసం", "అంబేద్కర్ జీవితం" పుస్తకాల ఆవిష్కరణ

ఏడవ రోజు " చలన సూత్రం" కథల సంపుటి ఆవిష్కరణ

ఆరవ రోజు "విశాల శూన్యం" కవితా సంపుటి ఆవిష్కరణ

ఐదవ రోజు "మనూళ్ళలో మా కథలు" ఆవిష్కరణ

వజ్రాయుధంతో ప్రజాచైతన్యం

ప్రముఖ కవి, రచయిత సోమసుందరం రచించిన వజ్రాయుధం కవిత్వం నాడు స్వాతంత్ర్య సమరం రోజుల్లో సంచలనం రేపడమే గాక ప్రజల్లో చైతన్యం నింపిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గానసభలో మంగళవారం సోమసుందరం జయంతి సభ జరిగింది. వంశీ అధినేత వంశీరామరాజు, వై. రాజేంద్రప్రసాద్, నాట్యగురువు సుధ, కళా జనార్ధనమూర్తి అతిథులుగా పాల్గొన్నారు. సుధ శిష్యులు తమ సంప్రదాయ నృత్యాలతో అలరించారు.

ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు-2019

కవులకు విజ్ఞప్తి

32వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు-2019 కోసం కవులు తమ కవితా సంపుటాలను పంపుకోవలసినదిగా అవార్డు వ్యవస్థాపకులు డా॥ ఉమ్మడిశెట్టి రాధేయ ఒక ప్రకటనలో తెలియజేస్తున్నారు.

అవార్డు పరిశీలన కోసం 2019లో ప్రచురించిన కవితా సంపుటాలను మాత్రమే పంపుకోవాలి

అవార్డుకు ఎంపికైన ఉత్తమ కవితా సంపుటికి ఐదువేల రూపాయలు నగదు మరియు షీల్డుతో కవికి సత్కారం ఉంటుంది.

జనవరి 31 2020 తేదీలోగా 4 ప్రతులు ఈ క్రింది చిరునామాకు పంపుకోవాలని తెలియజేస్తున్నారు.

డా॥ రాధేయ, చైర్మన్ ఉమ్మడిశెట్టి లిటరీ ట్రస్ట్, 31-1-606-1, షిర్డినగర్, రెవిన్యూకాలనీ, అనంతపురం- 515 001, సెల్: 9985171411, 8247523474

మనిషి ప్రకృతిలో భాగమే

జయరాజు 'అవని' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

'అవని' పుస్తకావిష్కరణలో రమేశ్, సత్యనారాయణ, బీసీ కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు, జయరాజు, శ్రీరామ్, జూపూడి ప్రభాకర్, ఆర్. నారాయణమూర్తి.

మనిషి ప్రకృతిలో భాగమని, ఆ ప్రకృతిని కాపాడుకుంటేనే అది మనల్ని కాపాడుతుందని వక్తలు పేర్కొన్నారు. ప్రజాకవి జయరాజు రచించిన 'అవని' పుస్తకావిష్కరణ సభ మంగళవారం రాత్రి రవీంద్రభారతిలో జరిగింది. ప్రకృతి తత్వవేత్త శ్రీరామ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ ప్రకృతి అందాలను కళ్లకు కడుతూ దాన్ని ధ్వంసం చేసే అధికారం మనిషికి లేదని జయరాజు చెప్పిన తీరు ఆలోచింపజేసేదిగా ఉందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు, తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా॥ అయాచితం శ్రీధర్, తెలంగాణ ప్రజా పార్టీ వ్యవస్థాపకులు జస్టిస్ చంద్రకుమార్, దళిత ఉద్యమనేత జూపూడి ప్రభాకరరావు, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర పూర్వ శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, గద్దర్ సినీ నటుడు ఆర్.నారాయణ మూర్తి, జలసాధన సమితి నేత సత్యనారాయణ, అరుణోదయ కళామండలి నేత విమలక్క, జన విజ్ఞాన వేదిక నేత రమేశ్ పాల్గొన్నారు.

కల్వకొలను గ్రామం, పెద్దకొత్తపల్లి మండలం,మహబూబ్‌నగర్ జిల్లాలో నారాయణదాసు నరసాచార్యులు రుక్మిణాంబ దంపతులకు శ్రీ నారాయణదాసు రామాచార్యులు మార్చి 26న 1926లో జన్మించారు. జ్యోతిష, ఆగమ, వాస్తు శాస్త్రాలందు అపార జ్ఞానమునార్జించి "మహనీయుల చరిత్రలు" విశ్వబ్రహ్మణుల పురోగాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు సల్పి, ఎన్నో బిరుదములు పొంది శ్రీ మౌనేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకులుగా విశ్వబ్రాహ్మణ ధర్మపీఠ ప్రతినిధిగా ఎన్నో సేవలు సల్పిన ఆ మహనీయుని జీవిత విశేషాలు.

నారాయణ దాసు శ్రీరామాచార్యుల ఘన చరిత

"వంశమునుద్ధరింప విశ్వబ్రహ్మణుండు
శ్రీరామాచార్య నామ నరుడు నరప
రుక్మిణమ్మలకు నుదయించి గొప్ప
ఉద్యోగము సల్పి సాహితీ సొబగున
శేషమ్మను చేబట్టి సత్పుత్రులను గని
ఘనముగ కీర్తి నొందె నీతడు,
నిజముగ నారాయణదాసుడయ్యె"

"విశ్వజ్ఞ కాసార కైరవ సార్ధకుడు శ్రీరామచార్యుల వారు" కొలనులో "విరిసిన కలువ" అది తన సొబగులో ఆ కొలనుకు ఎంతటి అందమును ఆపాదిం చుచునుండునో అదే విధముగా శ్రీరామాచార్యుల వారు వారి సాహిత్య పటిమచే సాహితీ పాఠకుల 'కొలను వంటి హృదయాల్లో' వాడిపోవని కలువ వలే సుస్థిరస్థానాన్ని ఆక్రమించినాడు. కాబట్టి "విశ్వజ్ఞవంశ కాసార కైరవమనే బిరుదు సార్ధకమైనది.

విశ్వజ్ఞ వంశ= విశ్వబ్రాహణ (విశ్వజ్ఞ) వంశమనెడి,

కాసార= చెరువునందు (విరబూసిన)

కైరవము= తెల్లకలువ (శ్రీరామాచార్యుల వారు)

సత్పుత్రుడు వంశానికే వన్నె తెచ్చినట్లుగా ఈ విశ్వజ్ఞుడు కూడా వారి వంశానికే ధృవతార వలే నిల్చెను.

కల్వకొలను గ్రామం, పెద్దకొత్తపల్లి మండలం, మహబూబ్‌నగర్ జిల్లాలో నారాయణదాసు నరసాచార్యులు రుక్మిణాంబ దంపతులకు మార్చి 26 1926లో జన్మించిన శ్రీ నారాయణదాసు శ్రీరామాచార్యులు, జ్యోతిష, ఆగమ, వాస్తు శాస్త్రాలందు అపార జ్ఞానమునార్జించి "మహనీయుల చరిత్రలు" విశ్వబ్రహ్మణుల పురోగాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు సల్పి, ఎన్నో బిరుదములు పొంది శ్రీ మౌనేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకులుగా విశ్వబ్రాహ్మణ ధర్మపీఠ ప్రతినిధిగా ఎన్నో సేవలు సల్పియున్నారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత –

– డా॥ కె. బాలస్వామి గారు శ్రీరామాచార్యులు వార్యు విరచితమైన "వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర" అను పుస్తకరాజంలోని ఆముఖం నందు

"కలియుగమందు జనులకు
పలికిన శ్రీ కావ్యసుధలు – బహుముఖములుగన్
వెలుగులు జిమ్మెను ముక్తికి
తలుపగ శ్రీ వీరగురుని తత్వమే బాలున్

అంటూ శ్రీరామాచార్య రచనా 'వైచిత్రి' విశేషములను తెలియజేసినాడు. రంగరాజు చరిత్ర, దక్షిణామూర్తి చరిత్ర, పోతులూరయ్య చరిత్ర, ఈశ్వరమ్మ చరిత్ర మొ॥ ఎందరో మహానీయుల వంశ భవిష్యత్తును గూర్చి రామాచార్యులవారు రచించిన విధానమును క్రింది మరో పద్యంలో బాలస్వామి గారు ఇలా వివరించారు.

కు॥ ఇమ్మహి రామాచార్యులు
నమ్మిన శ్రీ వీరగురుని – నరులకు జూపెన్
కమ్మని గాథలనెన్నియు
నమ్మితి ఈ గ్రంథమందు – సద్గతులందున్

శ్రీరామచార్యుల వారు శ్రీ వీరబ్రహ్మేంద్ర విరజిత కాలజ్ఞన భూత, భవిష్య ద్వర్తమాన విషయాలు సంగ్రహము అను సంపాదక గ్రంథము నందు. వీర గురు స్తుతి గావించిన విధము ఈ పద్య రత్నము ద్వారా తెలుసుకోవచ్చును.

గౌ॥ చదువ చదువబుట్టు చదువన రుచిబుట్టు
చదువ చదువ నొక్క తలపు పుట్టు
తలపు పుట్టు చదువు చదువ తానే నయా
వీరబ్రహ్మ నిన్నె చేరి కొలుతు

అందుకే ఆయనకు (వీరబ్రహ్మేంద్ర స్వామి) వారికి గుడుల కట్టి, భక్తి శ్రద్ధతో ప్రజలు పూజ చేయు విధానం రామాచార్యులచే తెల్పబడింది.

"లోగానుమాగిని లోకాలోకాలెల్ల
కాలజ్ఞానము జూడ దెలినీనిమా
వాక్పుప దైవంబులేదన్న వారెల్ల
ఆకురాలినట్లు రాలే సుమా!!

అంటూ భక్తి నమ్మకం గూర్చి విశ్వశర్మ వ్రత విధానంలో తెల్పినాడు

దైవం భూలోకంలో జరుగు అకృత్యాలను అణచడానికి ఏదో రూపంలో జన్మిస్తుంది. అదే దశవతారాల్లో చెప్పబడింది. అలాంటి దైవం ఆంధ్రప్రదేశ్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి వారు, కర్ణాటకలో శ్రీ మహేశ్వర స్వాముల వారు భూమిపై వెలిసిన పుణ్యమూర్తులని వారి మహిమల్ని గూర్చి శ్రీరామాచార్యుల వారు విదితపర్చిన అంశాలు అత్యద్భుతం.

కం॥ సిరిమించు కందిమల్లయ్య
పురమున గల మఠములోని బుధనుతుడగు
గురు వీరబ్రహ్మన్వయ
చరితము వినిపించుగురుని శరణని నిపుడున్

శ్రీ కలియగంలో 16వ శతాబ్ధిలో వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు తెలియబర్చిన కాలజ్ఞాన విశేషములను శ్రీరామాచార్యులవారు "వీరబ్రహ్మ చరిత్ర" గ్రంథములో చక్కగా తెలియజేసినారు. వీరబ్రహ్మం తన తప : శక్తిచే సృష్టి, జన్మ రహస్యములను తెలుసుకొని ప్రజలకు భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాదుల్లో జరిగిడి సంఘటనలను ముందుగానే తెల్పి వారలను జాగరుకుండే విధమున మేల్కొలుపు గావించినాడు. అలాంటి మహానుభావుని చరిత్రను వివరించిన ఈ పద్యం గుళిక శ్రీ రామాచార్యుల వారి సాహితీ కృషి అభినందనీయము.

కం॥ కలియుగపాద చతుష్టయ
ములయందున జరుగునట్టి – ముఖ్యాంగంబుల్
దెలిపెడి కాలజ్ఞానము
సలలితముగ వ్రాయుచుంటి సత్యము శిష్యా

కలియుగంలో 16వ శతాబ్దం కంటే ముందు '8' వ శతాబ్ధి కర్ణాటక రాష్ట్రంలోని 'గోనాల' గ్రామంలో 'మౌనేశ్వర స్వామి" అవతరణ 700 సం॥లు జీవించి తింధిణీలో అందరి ముందు సమాధి అయి పంచభూతాల్లో కలుస్తాడు. ఇప్పటికీ మాఘ శుద్ధ త్రయోదశి నాడు స్వామి ఆరాధన జరిగాక పక్షి రూపంలో వచ్చి రాశిగా నివేదించిన అన్నం ముట్టి వెలతాడని, తదుపరి వడ్డన భక్తులకు సమర్పింపబడుతుంది. ఇక్కడొక సంప్రదాయం గమనించవచ్చు. ఏమనగా అక్కడి భక్తులంత జందెమివ్వడం (గాయిత్రి) జరుగుతుంది. ఇదో నియమం.

మౌనేశ్వర శివస్సర్వేశ, సర్వతంత్రషుభూతలే
త్వన్నామ దేశికోవ్యాప్తం, అహంభో అభివాధయే
సంసార సాగరం ఘోరం, కర్తు మిచ్ఛతియో నర:
మౌన నామం సదాధ్యానే, వ్రతయతి సుఖేన్నర:!!

ఇట్టి విషయలన్నియూ శ్రీరామాచార్యుల కృతుల పరిశీలనలో విదితమగుచున్నది.

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య కుల, మత విచక్షణ లేకుండా అందరికీ గాయిత్రి మంత్రోపదేశం చేయించాలని ఆశించేవారట. ఆనాటి వివిధ హైందవేతర మతాల్లో వర్ణ భ్రష్టులైపోతున్న హిందువులకి ఇతడు ప్రవేశపెట్టిన శుద్ధ కార్యక్రమంగా దీనిని ఆచార్యుల వారు తలపోసిరి.

ఒక వస్తువుకు ఉపనయనం చేయడమంటే ఎన్నో కర్మకాండలు అవసరం. కానీ ఏ ఆర్భాటం లేకుండా కన్నడిగులు గల ప్రాంతంలో బ్రహ్మణత్వాన్ని ఆపాదిం చడమంటే అది గొప్ప సంస్కారం. అట్టి ఉపన యన గాయిత్రీ మంత్ర పద, పదార్థ అర్థాన్ని చక్కగా "సులభ గాయిత్రీ పుస్తకం నందు తెలియజేసినారు. మానవుడు జీవితములో ఆచరించే ప్రతి పని ఫలితమయ్యే కోణంలో ఈ "మంత్ర మహిమ" కానవస్తుంది.

సృష్టి విశ్వ రహస్యమేమనగా దేవతలు, మోక్షప్రదాతలు, జీవులు మోక్షము పొందగోరువారు. వీరిద్దరినీ సృష్టించి నడిపించగలవాడే "విశ్వకర్మ" విశ్వంలో జరిగే ప్రతి పని వెనుక ఆయన పాత్ర కలదు. మను, మయ, త్రష్ట, శిల్పి, విశ్వజ్ఞ బ్రహ్మలను సృష్టించుట జరిగింది. తర్వాత సకల జీవజలాన్ని సృష్టించడం జరిగింది. విశ్వకర్మ భగవానుడు ఈ లోకాన్ని నడిపించే కార్యములో నిమగ్నమై ఉంటాడు. అట్టి విశ్వకర్మ భగవానుని "యజ్ఞము" మరియు "మహా వ్రతము" చేసి స్వామి వారి కృపకు పాత్రులయ్యే విధానాన్ని "శ్రీరామాచార్యుల వారు చక్కగా రూపొందించినాడు."

విశ్వసృష్టికి కారణభూతుడే భగవానుడు, ఈయన సద్యోజాల్, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానములు అను పంచముఖ ములు కలవాడు. వీటి నుండే మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ అను పంచబ్రహ్మలు ఉద్భవించారు. మానవ లోకంలో మహోన్నతమైన జీవనము కొనసాగించుటకు నీతి నియమ సాధనకు శ్రీరామాచార్యుల వారు చక్కని మంత్ర పుష్పమును తెలియచేసినాడు.

విశ్వకర్మ పంచముఖుడు. దశభుజుడు, అలాంటి స్వామి వ్రత విధానం సులభరీతలో శ్రీరామాచార్యుల వారు వివరించినాడు. సృష్టికి పూర్వం నిరాకారుడైన విశ్వకర్మ స్వయం భువుగా, వెలసి "ఓం" అనే ప్రణవనాదాన్ని పుట్టింది. అదే సృష్టి బీజం. విశ్వకర్మ పంచ ముఖుల నుండి పంచబ్రహ్మలు పుట్టి, పంచ భూతాలకు అధిపతులయ్యారు. బ్రహ్మాది దేవ తల్ని, విశ్వాన్ని సృష్టి చేసి, కావలసిన వసతుల్ని సమకూర్చిన బ్రహ్మజ్ఞి "విశ్వకర్మ" ఆయన వ్రత విధానం, నేడు ఎన్నో విశ్వబ్రహ్మణ సంఘములోని సభ్యులు నిరవధికంగా కొనసాగించుచూ స్వామి కృపలకు పాత్రుల గుచున్నారట శ్రీరామాచార్యులు రూపొందించిన "విశ్వకర్మ మహా వ్రత" విధాన గ్రంథమే సాక్ష్యము.

"విశ్వకర్మా పరబ్రహ్మ, విశ్వకర్మా మహాశయా
విశ్వకర్మాచవసవో, విశ్వకర్మ మను:శ్మివ:
విశ్వకర్మా సృష్టికారో విశ్వకర్మా చ దేశిక:
విశ్వకర్మా, సురజైష్ఠా, విశ్వకర్మా జగద్గురు:"
"అప్పటి నుండియు గురువడు
నెప్పుడు స్మృతిపథము నిలుపు నిచ్ఛామతిలో
మెప్పగ నిజవంశయునకు
చొప్పడ నారాయణాఖ్య శోభాంకమిడెన్"

శ్రీరామాచార్యుల వారి వంశస్థులు ఎన్నో విశ్వబ్రాహ్మణ సంఘములను, మహాసభలను ఏర్పాటు చేసి కొల్లాపూర్ (పెంట్లవెల్లి), నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వరంగల్లు, హైదరాబాద్ మొ॥ ప్రాంతాల్లో విశ్వకర్మ యజ్ఞాలను సైతం చేయించారు. ఈ విధముగా శ్రీరామాచార్యుల వంశస్థులు సంఘ సంస్కర్తలవలే పనిచేసినారు. అందుకే రామాచార్యుల వారు అన్నగారైన "శ్రీ జొజ్జయాచార్యులు" నిల్పిన, మౌనేశ్వర స్వామి ఆలయం పునరుద్ధరించాల్సిందిగా పుర ప్రజలు కోరిన వెంటనే మహబూబ్‌నగర్‌లో అటవీశాఖ ఉద్యోగ విరమణ పొందియున్న శ్రీరామాచార్యుల వారు "అర్చకత్వ భారాన్ని భుజ స్కంధములపై వేసుకొని "శ్రీ మౌనేశ్వర మహాత్మ్య అంటూ "నారాయణదాసు రామాచార్యుల వంశచరిత్ర" అను గ్రంథరత్నంలో ఆలంపురి బ్రహ్మానందం గారు మరియు కపిలవాయి లింగమూర్తి గార్లు ఆచార్యుల వంశస్థుల జీవిత విశేషాల్ని తెలియజేసినారు. సహిత గురు పుష్య యోగ్య వ్రతము దివ్య గ్రంథమును రచించెను. అర్భక ద్విజుడు శ్రీ రామాచార్యుల వారు.

"వంశమూల పురుషవర్యుడు రామచం
ద్రాహ్వయునకు నవ నిధానములుగ
గలిగినట్టి వంశకరులం ద్వితీయుడే
సుతన కిడెను గురుని సొబగు పేరు"

శ్రీ రామాచార్యుల వారు సంఘజీవులు ఎక్కువ అభిమానము కలవారు. విశ్వబ్రాహ్మణ సంఘాలు ఏర్పాటు చేసి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాలు నిర్మింపజేసి అందులోన విగ్రహ ప్రతిష్ట గావిం చినాడు. గాయిత్రీ శ్రీ చక్రాదుల ప్రతిష్ట కాళికాంబ శివలింగ ప్రతిష్టలు గావించి విశేక కీర్తి నార్జించినారు. ఇంకా విశ్వబ్రహ్మణ యజ్ఞము, గురుపీఠములు, కందుకూరి విజయం, సుభద్ర గాయిత్రీ సంధ్యావందనము మొ॥ ఎన్నో గ్రంథాలు రచించిన కవిదిగ్గజము.

పుట్టిన వానికి మరణం తప్పదు. అలాంటి మానవుడు జీవితాంతం చేసిన పాప పుణ్యాల ఫలితము తన వెంటే వస్తుంది. జ్యోతిష్శాస్త్రం ప్రకారం ప్రాణవాయువును బంధించుట, జీవమును త్యజించుట మిక్కిలి శక్తివంతమైనవి. పంచభూత సమన్వితం ఈ శరీరం. అట్టి శరీరం ప్రాణాన్ని వీడిన తర్వాత ఈ ప్రకృతిలోని పంచభూతాల్లో కలుస్తుంది. అలా కలువబోతున్న జీవంలేని శరీరానికి "అంత్యేష్టి కర్మ" విధానం ద్వారా ఏయే రోజుల్లో ఏఏ కార్యాలు చేయాలనే విషయం ఇది ఒక రకంగా "గరుడపురాణ" సారాంశం. "పితృకర్మ విధానం" యొక్క ప్రాముఖ్యతను తెల్పినాడు. సంస్కృతభూయిష్టమైన వేద సాహిత్యంలోని విషయములను సులభరీతిలో అందరికీ విదితమయ్యేలా తెలియజేశాడు.

మనుస్మృతి ప్రకారం హిందూ మత సంప్రదాయం ప్రకారం (2) రకాలని, శుద్ధ దేవతలని, పితృదేవతలు అని వారు సూర్య చంద్రలోకాల్లో ఉంటారని, పూజద్వారా శుద్ధదేవతలు, తర్పనాదుల ద్వారా పితృదేవతలు సంతృప్తి పొందుతుంటారని, కృష్ణ – శుక్ల పక్షాలు పితృదేవతలకు రాత్రి పగల్లవంటివి నెల నెలా బహుళ అష్టమి వారికి ఉదయం, అమావాస్య మధ్యాహ్నం అవు తాయి. అమావాస్య శ్రాద్ధకర్మలు వారికి మధ్యాహ్న భోజన సమానమవుతాయి. ఇలాంటి ఎన్నో విషయాలు ప్రేత పూజా విధానమును ఎవరికీ తెలియని రహస్యములను సైతం తెలియజేసినారు శ్రీరామాచార్యులవారు.

శ్రీరామాచార్యుల జీవితం ఆదర్శనీయం అందుకే శ్రీ అలంపురి బ్రహ్మానంద మహోదయులు వీరి వంశ చరిత్రను వైభోవోపేతంగా వర్ణించారు. ఒక చేత కుటుంబం మరోచేత ఉద్గ్రోం సాహిత్యము సమాజహితము ఆర్భ్యం ఇలా '5' బాధ్యతలను భుజ స్కంధాలపై వేసుకున్న "పంచభుజుడు శ్రీరామాచార్యులవారు అందుకే ఈయనకున్న బిరుదులు సార్ధకములగుచున్నది.

మ॥ "విశ్వకర్మగుణ ప్రచారక వేత్తయై యిల వెల్లుచున్
విశ్వసృష్టి విధానమెల్లను విశుతంబొనరించుచున్
నశ్వరంబగు మోహమాయను నాశమొందగ జేయుడం
చేశ్వరేశ్వరు విశ్వకర్మను నెంచుదాత్మను నాత్మగా"

ఇలాంటి గొప్ప మహనీయుల శ్రమ, కృషి సాహిత్యాంశములు, పూజా విధానములు, పుస్తక పర్యంతమే గాక నేటి సమాజమునకు ఎంతైనా అవసరమే. అట్టి వంశంలో పుట్టిన నావంటి వారికే ఆయన పుస్తక పఠనం చేస్తే గాని విధితమవ్వలేదు. నవంబర్ 21 2015న కీ॥శే॥లైన ఆ మహనీయుని పుస్తకములు వాటి వ్యాప్తికి వారి కుమారులు కన్వీ రఘువీర్‌ప్రతాప్, ఎన్వీ ధశరథ్‌లు వంశస్థులు, సాహిత్యాభిమానులు కృషి సల్పుతున్నారు. ప్రతి గ్రంథాలయము నందు ఈ మహనీయుని పుస్తకములు ఉండదగినవి.

– నారాయణదాసు మంజులాచారి
Net & Set, సంస్కృత, తెలుగు అధ్యాపకురాలు
నాగర్ కర్నూల్ చరవాణి : 6281570335

"పుట్టిన వానికి మరణం తప్పదు. అలాంటి మానవుడు జీవితాంతం చేసిన పాప పుణ్యాల ఫలితము తన వెంటే వస్తుంది".

పాలమూరు సాహితీ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో నారాయణ దాసు శ్రీరామాచార్యులు.

మహబూబ్ నగర్‌లో నారాయణదాసు శ్రీరామాచార్యుల పుస్తకం ఆవిష్కరణ సభలో భీంపల్లి శ్రీకాంత్, నర్సింహ్మచారి, కపిలవాయి లింగమూర్తి, గ్రంథాలయ చైర్మేన్ సత్తూరు రాములు గౌడ్ తదితరులు

గురువులను సేవిస్తూ నారాయణ దాసు శ్రీరామాచార్యులు దంపతులు

పుస్తకం ఆవిష్కరణ అనంతరం వేపూరి జానకిరామయ్య గారిచే సన్మానం స్వీకరిస్తూ

మహబూబ్ నగర్ లో దేవాలయ ప్రతిష్ఠలో భాగంగా తపస్సు చేస్తూ నారాయణదాసు శ్రీరామాచార్యులు

బ్రహ్మంగారి మఠం ఆధ్వర్యంలో సత్కారం అందుకంటూ

కవి రచయుత నారాయణదాసు శ్రీరామాచార్యులు గారి పుస్తకం ఆవిష్కరణ అనంతరం అలంపురం బ్రహ్మానందం, కర్షక్ ఇండస్ట్రియల్ అధినేత తదితరులు సత్కరించిన తరుణం



కవి రచయుత నారాయణదాసు శ్రీరామాచార్యులు గారిని సత్కరిస్తున్న దేవాదాయశాఖ కమీషనర్ లాల్కోట వేంకటాచారి, వి. జానకిరామయ్య. చిత్రంలో ఎన్వీ రఘువీర్‌ప్రతాప్.











కవిత్వం చదివితే కవిగా ఎదగొచ్చు

-డా॥ఎన్.గోపి

ప్రపంచ కవుల కవిత్వం చదివితే గొప్ప కవిగా ఎదగడానికి అవకాశం ఉంటుందని తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ వైస్‌ఛాన్స్‌లర్ డా॥ఎన్.గోపి అన్నారు. టీపీఎస్‌కే ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "డాక్టర్ ఎన్.గోపి కవిత్వంతో ఒక రోజు" అనే అంశంపై కవులు రచయిత్రులు, కవయిత్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వాన్ని చదవాలి, రాయాలి అన్నింటికంటే మిన్నగా కవిత్వంతో జీవించడం తెలుసుకోవాలని సూచించారు. చార్లిచాప్లిన్ ఎంతో పేదరికాన్ని అనుభవించారని, ఆయన ఎంతో గొప్ప నాటకాన్ని తయారు చేసి, ప్రపంచ చరిత్రను మార్చిన వ్యక్తి అని అన్నారు. సాహితీవేత్తలు భూపతి వెంకటేశ్వర్లు, అనంతోజు మోహన్‌కృష్ణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సూర్యోదయం నీకు కొత్త పాఠాలు చెప్పడం లేదా!

మబ్బులు చిక్కగా కమ్ముతున్నాయి
సముద్రం నుండి ఓ సన్నని రాగం
ఆ రాగ శృతిలో ఏదో ఆవేదన
సంవేదనకు దూరమైన అలజడి
ఆకాశం అందంగా వుంది
అందుండి సన్నని చినుకుల సవ్వడి
ఏదో మృదుతరంగ ధ్వని
అనంత మధనం ఆ స్వనంలో వుంది
చింతన, వివేచన, విద్యుత్తు దాని అంతరంగంలో వున్నాయి
నిజమే! ఆంతరంగికమైనవన్నీ నిధులు అవుతున్నాయి
స్థల, కాల,ఉత్ప్రేరణల నుండి వ్యక్తీకరణ
ఆ నివేదిత తార్కికురాలే
ఏది అవును! ఏది కాదో తనకు తెలియదా!
ముందు తన చిత్రం తన కందుతుందా!
తనకే అందనిది ఇతరులకు అందుతుందంటారా!
నీది వివేచనా! జ్ఞానతృష్ణా
రూపనైగ నిగ్యమా! ఆహార్య ఆలంబనమా!
తాత్త్విక చింతనా! మనోవిజ్ఞానమా!
నిన్ను నీవు అర్థం చేసుకోనంతకాలం
ఇతరుల అభిప్రాయం వైపు చూస్తూనే వుంటావు సుమా!
ప్రతి సూర్యోదయం నీకు కొత్తపాఠం చెప్పడం లేదా!
ఆ జాజిపువ్వు చూడు, రంగు, పరిమళంతో
పరిసరాలను పరవశింప చేస్తుంది
ఆ కొబ్బరి ఈనెల అంచుపై నిలబడిన
ఆ రంగుల పిట్ట ప్రకృతిని పరవశింపచేస్తుంది
ఆ నీటి చెరియల్లో గుంపులు గుంపులుగా
చేపల బృందాల కళ్ళు మెరుస్తున్నాయి
వలలకు అందని ఈత వాటిది
నదీ ప్రవాహం ఒడ్డునే మొలచిన
రసాలనం, తరాలుగా తియ్య ఫలాలనందిస్తుంది
ప్రవాహం పోతూనే వుంది, అది నిలబడి వుంది
నిశ్చలత నుండి, ప్రకృతి అనుసంధానత నుండి
నదీ ప్రవాహ శీలత నుండి అది ఫలిస్తూవుంది
నిజమే! అంతరంగం అందనిదే
దానిలోతుకు వెళ్ళే కొలది పెరుగుతూ ఉంటుంది
ఆ పదతి తరాలు ముందుకు చూడగలదు
నక్షత్ర మండలాన్ని భూమికి దించగలదు
ఆమె ఖగోళ శాస్త్రాన్ని పుక్కిట పట్టింది
తన గురించే ఇంకా శోధించలేదు
ఆ చరిత్రకారుడు చరిత్ర చెప్పాడు
చరిత్రగా మిగల్లేదు, చరిత్ర చెప్పడం బోధన
చరిత్రగా మిగలడం త్యాగం
అక్షరానికి కూడా అంతరంగం వుంది
భాషకు కూడా అంతరంగం వుంది
ఇవన్నీ వ్యక్తీకరణలో సజీవంగా వున్నాయా?
అతడు అక్షరాలు కుమ్మరించాడు
ఆమె చూపుతో సమాధానం చెప్పింది
ఆ చూపులో జీవం వుంది, ఆ చూపులో ఆశయం వుంది
నిగమన గమన సూత్రాలు ఆ చూపుకు తెలుసు
అవి నిద్రిస్తూ మేలుకొంటాయి, అవి మేల్కొంటూ నిద్రిస్తాయి
భాషను పొదుపుగా వాడి అవి విజయం పొందాయి
ఎన్నో శిల్పాలు ఎవరు చూడకుండానే
సూర్య ప్రభాస మానం అవుతున్నాయి
వెలుగు అందని శిల్పం చీకటిలో వెలుగులు చిమ్మింది
అవును! నిశ్శబ్దం ఒక కావ్యం, నిశ్శబ్దం ఒక సంగీతం
నిశ్శబ్దం ఓ తత్వశాస్త్రం
నిశ్శబ్దం నుండి వచ్చిన వాక్కు మానవోత్తేజం అవుతుంది
నిన్ను నీవు వెలిగించుకొన్నాక కదా!
ఇతరులకు వెలుగు నిచ్చేది
నీవు సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, వెన్నెలను చూసినంతగా
మట్టి పెల్లను చూడలేక పోయావు
అందుకే నీవు మట్టి నుండి కుండను చేయలేకపోయావు
నీవు కర్త కాదు, కర్మను చూడగలిగినప్పుడే
నీకు నీవందగలవు ఆ పదతి సంవేదితే
అనేక గుణాలను సమన్వయం చేసుకొంటుంది
సముద్రపులోతు, నదీ ప్రవాహ శీలత
పువ్వులోని సౌకుమార్యం, నీటి తుంపరుల్లోని
సంగీతం ఆమెకు అర్థం అవుతున్నాయి
ఇవ్వడమంటే జ్ఞానం, ఇవ్వడమంటే విద్య
ఇవ్వడమంటే సృజనం
అవును! చరిత్ర నిర్మాణంలో భాగం కాదు
తానే చరిత్రగా కదులుతోంది.
మనిషి ప్రకృతి సముజ్వల సమన్వయ శక్తులు సుమా!
వివేచనే ఉజ్వల భవిషత్తుకు సోపానం.

-డా॥ కత్తి పద్మారావు
సెల్:9849741695

విదేశీ భారతీయులకు నేరుగా డ్రైవింగ్ లైసెన్సులు

హైదరాబాద్,నవంబరు20(ఆర్ఎన్ఎ): విదేశాల నుంచి వచ్చే భారతీయులకు ఎలాంటి డ్రైవింగ్ నైపుణ్య పరీక్షలు జరుపకుండానే తెలంగాణ రవాణాశాఖ లైసెన్స్ ఇస్తున్నది. ఈ విషయం తెలియని చాలామంది లర్నింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకొని మరీ లైసెన్సు పొందుతున్నారు. ఉపాధి నిమిత్తం లేదా పారిశ్రామికవేత్తలుగా విదేశాల్లో స్థిరపడినవారు ఆయా దేశాలకు చెందిన డ్రైవింగ్ లైసెన్సు పొంది ఉంటే స్వదేశంలో మళ్ళీ డ్రైవింగ్ పరీక్షకు హాజరుకావాల్సిన అవసరం లేదు. వీసా, పాస్‌పోర్టుతోపాటు స్థానిక చిరునామా ఆధారాలు (ఆధార్ కార్డు, మున్సిపల్ ట్యాక్స్ బిల్లు, ఇక్కడి అడ్రస్‌తో ఉన్న ఇన్సూరెన్స్) స్థానిక (ప్రాంతీయ రవాణాశాఖ అధికారికి సమర్పిస్తే కొత్త లైసెన్సు జారీచేస్తారు. విదే శాలకు సంబంధించిన లైసెన్సు అసలుదా? నకిలీదా? అనే అంశాన్ని నిర్ధారించుకొన్న తర్వాతనే ఇక్కడి లైసెన్సు జారీచేస్తారు. అమెరికాకు చెందిన లైసెన్సుల ఒరిజినాలిటీ నిర్ధారించుకోవడం సులువని, ఇతర దేశాల్లో మాత్రం ఇబ్బందవుతున్నదని రవాణాశాఖ సీనియర్ అధికారి చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న డా॥ఎన్.గోపి.

ఉచిత హామీ పథకాలతో అభివృద్ధికి విఘాతం

హైదరాబాద్, నవంబర్20(ఆర్ఎన్ఎ):ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఆచరణ సాధ్యం కాని, ఆకర్శక పథకాలకు మామిలు ఇస్తున్నాయి. ఇలా వారు ఇచ్చే హామీలు ఒక్కోసారి అమలు సాధ్యమేనా అన్న ఆందోళన కలుగుతోంది. ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను బురిడీ కొట్టించడంలో ఇప్పుడు రాజకీయ పార్టీలు రాటుదేలాయి. ఎన్నికలలో ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని పార్టీలు తమ శక్తివంచన లేకుండా హామీలను గుప్పిస్తున్నాయి. దీంతో ఉచిత పథకాలకు ఖజానాను గుల్ల చేస్తున్నారు. ఇవన్నీ తమ జేబులోంచి ఇచ్చినట్లుగా పార్టీల నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. ఇలాంటి నథకాలకు మోసపోవడం తగదు. ప్రజలు చైతన్యం కావాలి. పథకాల నిగ్గు తేల్చాలి. అప్పుడే రాజకయా పార్టీలు తమ హామీల విషయంలో అప్రమత్తంగా ఉండగలరు. లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు నిలిచి పోగలవని గుర్తించాలి. ఉచిత కరెంట్, బియ్యం, సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు, రుణమాఫీ, రైతుబంధు,రైతుభరోసా ఇలా అనేకానేక పథకాలకు ఖజానా గుల్లవుతోంది. దీంతో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మౌలిక వసతుల కల్పన తలకు మించిన భారం అవుతోంది. ఇలా ఒకరిని మించి ఒకరు ఆయా రాష్ట్రాల్లో హామీలు గుప్పించి అధికారంలోకి రావడం అలవాటు చేసుకున్నారు. ఉచిత పథకాలకు దూరం అంటూ వచ్చిన బిజెపి నేతలు ఇలాంటి అమలు సాధ్యం కానీ హామీలతో ప్రజలను బోల్తాకొట్టించాలనుకోవడం సరికాదు. ప్రజలను స్వంత్రంగా నిలబెట్టే కార్యక్రమాలు చేపట్టాలే గానీ అన్ని ఉచితం అని చెప్పి అధికారంలోకి వచ్చాక చతికిల పడడం చూస్తున్నాం. అందువల్ల హామీలకు ఓ హద్దూపద్దూ ఉండాలి. మన బడ్జెట్ ఎంత..ఏ రంగానికి ఎన్ని కేటాయింపులు చేస్తే, ఏ మేరకు సర్దుబాటు చేయగలమో చెప్పేలా పథకాల రచన ఉండాలి. ఎన్నికల హామీలు, మేనిఫెస్టోల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించేకన్నా వాస్తవాలు చెప్పగలగాలి. అలాగే ఎదుటి పార్టీలు అలా చేస్తే నిలదీయాలి. ఎన్నికల సంఘం కూడా ఇలాంటి హామీలపై ఆంక్షలు విధించాలి. బడ్జెట్‌ను మించి చేస్తున్న వాగ్దానాలపై పరిమితి ఉండాలి. ప్రజల నుంచి పన్నుల రూపంలో వస్తున్న డబ్బులను దక్షతతో ఖర్చు పెట్టగలమన్న ధీమా ప్రజలకు కలిగించాలి. అంతేగానీ అధికారమే పరమావధిగా అరచేతిలో వైకుంఠం చూపరాదు. గత ఎన్నికల్లో కెసిఆర్ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడానికి బడ్జెట్ పొంతలను కుదరకపోవడమే ప్రధాన కారణం. సంక్షేమ రంగంలో విపరీతమైన హామీలు గుప్పించి చేస్తున్న కార్యక్రమాలు అభివృద్ధిని దెబ్బతీసాయి. అందుకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కిలో రూపాయి బియ్యం పథకం, ఉచిత విద్యుత్, మూడెకరాల భూ పంపిణీ, రైతుబంధు వంటి పథకాలు గుదిబండగా మారాయి. పొదుగొన్ని కొట్టి పొట్టోనికి పెట్టడం కాదు. పొట్టోని స్థాయిని పెంచగలగాలి. సంక్షేమానికి, అభివృద్ధికి సంబంధించిన విషయాలలో సమతుల్యత లోపించకుండా చూసుకోవాలి. ఇచ్చిన హామీలను విస్మరిస్తే విశ్వసనీయత ఎట్లా లభిస్తుందన్నది చూసు కోవడం లేదు. ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసినపుడు అప్పటి సమయాన్ని బట్టి, ప్రజల అవసరాల మేరకు పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తామని ప్రకటించారు. దీర్ఘకాలంపాటు తమిళనాడులో ఉండిన ఆయనపై అక్కడి సంక్షేమ పథకాల ప్రభావం బాగా ఉండేది. బియ్యం పథకం అక్కడ ఉండడం అలాంటి ఇక్కడ లేకపోవడంతో బాగా కలసి వచ్చింది. కానీ దానిని రెండు దశాబ్దాల తరవాత కాంగ్రెస్ పాలకులు రూపాయికి కుదించి బడ్జెట్ భారాన్ని పెంచారు. దీన్ని ఎలా సమర్థించు కుంటారో చెప్పాలి. ఇలాంటి పథకం వల్ల ఉపయోగమేమిటో చెప్పాలి. ఇది ఎంతగా అవినీతి పాలయ్యిందో గుర్తించాలి. తర్వాత వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబుకు మధ్య పోటీ ఏర్పడినపుడు కూడా ఉచిత విద్యుత్ ప్రస్తావన వచ్చింది. వైఎస్ఆర్ మొదటిసారిగా 2004లో గెలిచిన తర్వాత ఉచిత విద్యుత్‌ను అమలు చేసారు. ఈ పథకం ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రజల డబ్బుతో దీనిని కొనసాగిస్తున్నా దీని భారం ఎంతన్నది చెప్పలేకపోతున్నారు. బియ్యం, ఉచిత కరెంట్, రైతుబంధు డబ్బుల చెల్లింపులు ఏటేటా తడిసి మోపెడు అవుతున్న పథకాలు. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో ప్రజలు ఎప్పుడు బగు పడతారో చెప్పలేం. ఎన్నికలు వచ్చినపుడు ఎట్లాగైనా గెలవాలని పట్టుదల రాజకీయ పార్టీలకు ఉండడం సహజం. అందుకని అర్థంపర్థం లేని పథకరాలతో ప్రజలను మోసం చేయడం కూడా తప్పే. హామీలను ప్రజలు ఒక వేళ నమ్మగలరేమో కానీ పాలనలో అమలు కాకపోతే మొత్తంగానే విశ్వసించరు. విశ్వసనీయత ముందు ఎంతటి హామీలు అయినా ప్రజల దృష్టిలో నిలవవు. ఎన్నికల హామీలు, మేనిఫెస్టోల ద్వారా ఇవుడు ప్రజలను కొత్తగా మెప్పించవలసి వచ్చినప్పుడు గత పథకాలను విశ్లేషించాలి. ఏకకాలంలో డీఎస్సీ నిర్వహించి 30 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. బాల కార్మికులు, వితంతువుల అంశాలను ప్రత్యేకంగా రూపొందించామన్నారు. బ్రాహ్మణ, మున్నూరు కాపు, రెడ్డి, వైశ్య కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించి ఆదుకునేలా మేనిఫెస్టోను రూపొందించారు. ఇలాంటి హామీలు ఇచ్చే ముందు సమీక్షించుకుంటే అన్ని పార్టీలకు మంచిది. ప్రజలు కూడా తమకు తాయిలాలు ప్రకటించడం వల్ల వచ్చే నష్టాలను గుర్తించాలి. ఇవన్నీ తాము కట్టే పన్నుల నుంచే ఇస్తారని, పార్టీలు వారి జేబులో నుంచి ఇవ్వరని గుర్తించాలి. అలాకాని పక్షంలో పథకాలపై నిలదీయగలగాలి.

మూర్తిదేవి పురస్కారం వహించిన సందర్భంగా ఈనెల 12న కళా సుబ్బారావుకళావేదికలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను సత్కరిస్తున్న ధర్మకేతనం సాహిత్య కళాపీఠం అధ్యక్షులు ఎన్వీ రఘువీర్ ప్రతాప్. వేదికపై శైలజామిత్ర, బైస దేవదాసు, కాంతికృష్ణ, శంకర నారాయణ, కళా జనార్ధనమూర్తి.

శనివారం త్యాగరాయ గానసభలో బృందావనం, గానసభ ఆధ్వర్యంలో కాంతారావు జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, సినీ దర్శకుడు డాక్టర్ వద్దేపల్లి కృష్ణ, ఎంకే రాము, రచయిత్రి కేవీ కృష్ణకుమారి, వై.సుబ్రహ్మణ్యం, నూకల ప్రభాకర్, కాంతారావు కుటుంబ సభ్యులు రాజన్, సుశీల పాల్గొన్నారు.

గంగపట్నం దేవకి రెడ్డి రాసిన 'నందిని' నవలను తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డికి అందజేస్తున్న యన్. శ్రీరామ చంద్రరావు. చిత్రంలో కందుకూరి శ్రీరాములు, డా॥ నాళేశ్వరం శంకరం.

గానసభలో బాలల సందడి

గానసభలో బాలల దినోత్సవాన్ని కమలాకర లలిత కళాభారతి సంస్థ నిర్వహించింది. బాలలు-నితీశ్, తేజస్, దీక్షత్, నీలిమా, షోడశి, అపూర్వ, అమృత, వైష్ణవ్, ప్రణీత, సువర్ణ, ఉదయ్, అక్షర, హర్షిణి, దేవాదితలు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఆటాపాటలు, మ్యాజిక్, నృత్యాలతో సందడి చేశారు. జస్టిస్ శేషశయనారెడ్డి, ఆచార్య టీ. గౌరీశంకర్, డా॥కేవీ. కృష్ణకుమారి, జనార్ధనమూర్తి, చిమ్మపూడి, యెల్దా సుదర్శన్ పద్మశాలి, సాధన నరసింహాచార్యులు అతిథులుగా పాల్గొని బాలలను అభినందించారు.

సభా కార్యక్రమం:

అధ్యక్షులు : ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ గారు, వి.సి., ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

ముఖ్య అతిథులు : ప్రొఫెసర్ కె.ఎస్ చలం గారు, యు.పి.ఎస్.సీ మెంబర్
ప్రొఫెసర్ కంచ ఐలయ్య గారు, సామాజిక శాస్త్రవేత్త
శ్రీ మధు గారు, సి.పి.ఎమ్ రాష్ట్ర కార్యదర్శి
డా॥ సమరం గారు, నాస్తిక కేంద్రం
శ్రీమతి కత్తి స్వర్ణ కుమారి గారు, లుంబినీవనం

విశిష్ట అతిథులు : శ్రీ కె రామచంద్రా మూర్తి గారు, సీనియర్ పాత్రికేయులు, సంపాదకులు
శ్రీ మల్లు రవి గారు, తెలంగాణ దళిత రాయకీయ నాయకులు
శ్రీ అంగళకుర్తి విద్యాసాగర్ గారు, సినియర్ ఐ.ఏ.ఎస్ అధికారి
శ్రీ ఎమ్ దయాసాగర్ గారు, ఐ.ఆర్.ఎస్ అధికారి
శ్రీ కోటి జేమ్స్ గారు, ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ
శ్రీ తేళ్ళ జడ్సన్, కారంచేడు భాదితుల సంఘం

గౌరవ అతిథులు : శ్రీ ముత్యాల ప్రసాద్ గారు, సంపాదకులు, విశాలాంధ్ర
శ్రీ ఎమ్.వి.యస్ శర్మ గారు, సంపాదకులు, ప్రజాశక్తి
శ్రీ బైసా దేవదాస్ గారు, సంపాదకులు, నేటినిజం

పుస్తక సమీక్షకులు : శ్రీ రాచపాళెం రామచంద్రా రెడ్డి గారు, అధ్యక్షులు, అభ్యుదయ రచయితల సంఘం
ప్రొఫెసర్ చందు సుబ్బారావు గారు, కార్యవర్గ సభ్యులు, అభ్యుదయ రచయితల సంఘం
ప్రొఫెసర్ కె వై రత్నం గారు, హెచ్.సి.యు
శ్రీ వల్లంపట్ల నాగేశ్వరరావు గారు, కవి, హేతువాద ఉద్యమ నాయకులు
శ్రీ కోయి కోటేశ్వరరావు గారు, సాహితీవేత్త

ఆత్మీయ అతిథులు : శ్రీ పి. గురప్ప గారు, శ్రీ చింతపల్లి గురుప్రసాద్ గారు
శ్రీ నల్లా గంగాధర్ గారు, శ్రీ పొన్నం రవిచంద్ర గారు
శ్రీ కందుల ఆనందరావు గారు, శ్రీ విజయ్ సింగ్ గారు
శ్రీ పిల్లి విద్యాసాగర్ గారు, శ్రీ వనమా బాలవజ్ర బాబు గారు (డైమండ్ బాబు)
శ్రీ పొల్లేటి పెంటారావు గారు, శ్రీ సాగర బేగం గారు
శ్రీ స్నేహ రెడ్డి గారు, శ్రీ అక్కిదాసు జాషువా గారు
శ్రీ వై. చంద్రశేఖర్ గారు, శ్రీ దుడ్డు భాస్కరరావు గారు
శ్రీ కొరబండి ఆంథోని, శ్రీ రత్న ప్రసాద్ గారు

స్వాగతం : మట్టా ఝాన్సీ గారు, డా॥ కనపర్తి అబ్రహాం లింకన్ గారు కో-ఆర్డినేటర్, లోకాయత ప్రచురణలు
ప్రారంభ గీతం : జైభీం బాలకృష్ణ గారు, వేము మాధవ్ గారు
కవితా పఠనం : గడ్డం విజయ రావు గారు

నిజదేవోభవ...

(జనం కోసం, సమాజవనంకోసం, శ్రమైక జీవనపథాన సాగుతున్న శ్రామికదైవాలకు అంజలిఘటిస్తున్న శీర్షిక..)

నాయీ బ్రాహ్మలకు వందనాలొనరింతున్

-దోరవేటి
సెల్:9866251679

కం॥ మా యీ జీవనచక్రము
హాయిగ నడిపించగా సహాయ మొనర్చే
శ్రేయస్కరులే మీరని
నాయీ బ్రాహ్మలకు వందనము లొనరింతున్.

ఉ॥ కాలము మారె, యంత్రపు యుగమ్మున జీవనమెంతొ హాయిగా
తేలుచునుండె కాని, భవదీయ ప్రమేయము లేక వేయగా
జాలము ముందు కొక్కడుగు చక్కగ, నిక్కువ మిత్రమాట! రో
మాలయమైన దేహము కవరిత సేవలు మీవి మిత్రమా!

ఆ॥ పుట్టు వెంట్రుకలను ముట్టిన దాదిగా
మట్టిలోన కట్టె మడియుదాక
స్త్రీలు పురుషులకును మేలగు మీసేవ
లవసరమ్ము సత్యమరసి చూడ.

ఉ॥ జుట్టును కత్తిరించి కడు శోభను గూర్తురు మస్తకంబుకున్
కట్టును చెట్టి మీసమున కారణమేదురు మోవి వన్నెకున్
చట్టన గడ్డమున్ గొరిగి చక్కదనమ్మును పెంచు సత్కళా
భక్కులు మీరటంచు మది పొడుదు మీ చతురత్వ భీనిధిన్.

ఉ॥ యుద్ధము లందు కత్తి పరయోధుల కుత్తుక లుత్తరించి, శా
శ్వతధన కీర్తి గాంచుటది సత్యముగాదు, పరాయి దుష్టమున్
వృద్ధిని జేయు నయ్యది; యొకించుక నెత్తురు రాలకుండ మీ
శుద్ధక్రియా కలాపమును జూపెడి కత్తి ప్రసిద్ధి గెన్సయా.

ఆ॥ జుట్టు నుత్తరించి, పట్టి మర్దన జేసి
గోళ్ళు దీసి, వేడి నీళ్ళు పోసి
ప్రసవ వేళలందు పలు సాయములు జేయు
మీ కులమ్ము దెంత మేలు జన్మ!

మ॥ తలనీలాలను గొంచు సంతసమునన్ దైవమ్ము లిష్టక్రియన్
పలు కోర్కెల్ నెరవేర్చు చుందురట! ఆ భాగ్యమ్ము నందించు స
త్కళ మీదేగద! దేవతా స్థలములన్ కైంకర్య రీతిన్ నిరం
తరమున్ మున్నుదు రెంత శ్రేష్ఠతర మా భాగ్యమ్ము నాయీశ్వరా!

ఆ॥ దినము దినము పెరుగుచును వెంట్రుకలు మదిన్
కలవరింప జేయు కలత దీర్చ
కత్తి, కత్తెరలను ఘన శస్త్రములు దాల్చి
ప్రజల గాచు మాన్యవరులు మీరు!

చం॥ శుభముల శోభ పెంచెదరు చొక్కపు వృత్తి; నమంగళంబులన్
ప్రభులను గోలుపోయెడి యవారిత వేళల స్త్రీల కేశముల్,
అభమ శుభమ్ములందు పురుషాళికి క్షౌరము జేసి, సంస్కృతీ
విభవము గాచుచున్న పదవిన్ విధిగా నెరవేర్చు కర్మఠుల్!

ఆ॥ దేశదేశములను దేదీప్యమానమై
వెలుగుచున్న మీ ప్రవీణతకును,
గర్వమింత లేని కార్యశీలతకును
ప్రణుతి సేతు నాయి బ్రహ్మలార!

హాస్టల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

హైదరాబాద్,నవంబరు20(ఆర్ఎన్ఎ): నగరంలో విషాదం చోటు చేసుకుంది. ఓ సాఫ్ట్‌వేర్ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. గౌచ్చిబౌలిలోని ఓ లేడీస్ హాస్టల్‌లో ఈ ఘటన జరిగింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పొగాకు హరిణి(24) అనే యువతి గచ్చిబౌలిలోని ఓ లేడీస్ హాస్టల్‌లో ఉంటూ మాదాపూర్‌లోని గోల్డెన్‌హిల్స్ క్యాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తోంది. రెండున్న సంవత్సరాలుగా ఆ సంస్థలోనే హరిణి పని చేస్తోంది. అయితే బుధవారం ఆఫీసుకు వెళ్లని హరిణి.. హాస్టల్‌లో తన గదిలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. విషయం తెలుసుకున్న రాయదుర్గం పోలుసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఉద్యోగం కోల్పాతాననే మనస్థాపంతోనే హరిణి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు భావిస్తున్నారు. ఆమె పనిచేస్తున్న సంస్థ ఒప్పందం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ నెలతో ఆమె ఉపాధి ముగియనున్నట్లు పోలీసులు చెప్పారు. దీంతో ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెబుతున్నారు.



Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com